C KSR02B176

ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
జులై 16, 2017

స్నేహ

ENTERED

నల్లజాతి సూరీడు



ఇవీ మన చిత్రాలే...!



మన చిత్రాలు హాలీవుడ్ స్థాయికి చేరుకోవాలనేది ఎక్కువమంది భారతీయుల కోరిక. అలా ప్రతి మూవీ రిలీజ్ తర్వాత మనం క్రియేటివిటీలో కాస్త వీక్ అంటూ మన చిత్రాలని తక్కువ చేసేసుకుంటున్నాం. నిజానికి భారతీయ చిత్రాల్లో అంతర్జాతీయ ఖ్యాతిని, అవార్డులని దక్కించుకున్న చిత్రాలూ లేకపోలేదు. వివిధ ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో ప్రదర్శించబడి అవార్డులని దక్కించుకున్న చిత్రాల్లో 'పార్చెడ్' ఒకటి. గ్రామాల్లో కొనసాగుతున్న బాల్యవివాహాలు, మూఢాచారాల కథాంశంగా లీనా యాదవ్ దర్శకత్వంలో విడుదలైన ఈ చిత్రం అదే సంవత్సరం టొరొంటొ అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శించబడింది. భారతీయ న్యాయ వ్యవస్థ ట్రయల్ విధానంలోని లోపాలని కళ్ళకుకట్టినట్టు చేసిన చిత్రం 'కోర్ట్'. చైతన్య తమ్హనే దర్శకత్వంలో వచ్చిన ఈ మరాఠీ చిత్రం 62వ జాతీయ ఫిల్మ్ అవార్డుల్లో ఉత్తమచిత్రంగా అవార్డుని దక్కించుకోవడంతో పాటు వివిధ ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో 19కి పైగా అవార్డులని సొంతంచేసుకుంది. చిన్నారుల మనస్తత్వాన్ని అందంగా తెరకెక్కించిన హిందీ చిత్రం 'గట్టు'. చలనచిత్ర సమీక్షకులు, విమర్శకుల ద్వారా ప్రశంసలు అందుకున్న ఈ చిత్రం అంతర్జాతీయ బెర్లిన్ ఫిల్మ్‌ఫెస్టివల్లో ప్రదర్శించబడిన బాలీవుడ్ చిత్రాల్లో ఉత్తమ చిత్రంగా అవార్డుని అందుకుంది. కలకత్తా నిరుద్యోగంపై 2014లో విడుదలైన 'లేబర్ ఆఫ్ లవ్' ఉత్తమ దర్శకత్వం, సినిమాటోగ్రఫీ విభాగాలకి అంతర్జాతీయ ఫిల్మ్ అవార్డులు దక్కాయి. ఏ సిటీస్ ఆఫ్ స్లీప్' (2015), 'పెడలర్స్'(2012), 'లూసియా' (2013), 'జై భీమ్ కామ్రేడ్ (2011)', సైఫై చిత్రం 'సోంచిడి', 'ది జపనీస్ వైఫ్' అందర్జాతీయ స్థాయి ఆదరణని దక్కించుకున్న చిత్రాలే.









KS RO2B 176
ENTERED

పనస పండుగ

పండగొచ్చిందంటే మనం ముందుగా కొనితెచ్చుకునేది పళ్ళనే. ఇళ్ళలో జరిగే వేడుకల్లో రకరకాల పళ్ళు భాగమైపోవడం మామూలే. కానీ పండుకే ప్రత్యేకంగా ఓ పండుగ వుంటే ..... ఇలాంటి ఆలోచనే వచ్చిందేమో గోవా వాసులకి. అందుకే అక్కడ ప్రతి ఏటా పనసపళ్ళ పండుగని జరుపుకుంటున్నారు. ఇంతకీ పండుగ అక్కడ ఎలా మొదలయ్యిందో మీరే చదివి తెలుసుకోండి.

పనసపండు తియ్యటి ఫ్లేవర్‌కి ఎవరికైనా నోరూరుతుంది. ఓ తొన లాగించేయాలనిపిస్తుంది. అంత పెద్ద పండును మరీ అలా ఒక్కరే తినేస్తే ఎలా....కాస్త ఇరుగుపొరుగు వారికీ పంచిపెడితే ఆ ఆనందమే వేరు.....ఇలాంటి ఓ మంచి ఆలోచనతోనే గోవాలో మొదలైంది జాక్ ఫ్రూట్ ఫెస్టివల్.....దీన్నే ఇప్పుడు జాక్ ఫ్రూట్ డేగా పిలిచేసుకుంటున్నారు. ప్రతి ఏటా జులై 24న జరుపుకునే ఈ వేడుకనే అక్కడ పోన్సాచెమ్ అని పిలుస్తారు.



రుతుపవనాలు వచ్చే కాలానికి కాస్త ముందుగానే అక్కడ పనసకాయలు పండుదశకి వచ్చే ఈ కాలంలోనే అక్కడ రకరకాల పూలతో సావ్ జావో అనే పండుగని చేసుకుంటారు. పూల వేడుక జరుగుతున్న సమయంలో అందివచ్చిన పనసపళ్ళతో గోవాలోని వివిధ స్వచ్ఛంద సంస్థలు జాక్‌ఫ్రూట్ వేడుకని నిర్వహిస్తాయి. ఇంతకీ ఈ పండుగ ఎలా జరుగుతుందనేగా మీ సందేహం. ఫ్రూట్ ఫెస్టివల్ అంటే ఏదో నాలుగు పనసపళ్లు నోట్లో వేసుకుని ఇంటికెళ్ళిపోవడం కాదు. దాదాపు ఓ రోజు మొత్తం ఈ పండుగని నిర్వహిస్తారు. రకరకాల పూలతో అలంకరించిన బుట్టల్లో, చాటల్లో పనసతొనలని ఉంచి వేడుక జరిగే ప్రదేశానికి తీసుకొస్తారు. కొత్తవారికి ఇది కాస్త వింతగా అనిపించినా.... ప్రకృతికి మరింత దగ్గరయ్యేందుకే ఇలాంటి పండుగలు ఉపయోగపడతాయనేది గోవావాసుల ఆలోచన. సహజంగా మామిడి, కొబ్బరి చెట్లు వేర్లు కాండం, కొమ్మలు, ఆకులు, ఫలాలు ఇలా ప్రతి ఒక్కటీ మన అవసరాలకి ఉపయోగపడేవిగానే వుంటాయి. అలానే గోవాలో పనస చెట్ల కలపతో టేబుళ్లు, కుర్చీలు ఇతర గృహోపకరణాలని తయారుచేస్తుంటారు. కాయల్ని కూరలు, పచ్చళ్ళ తయారీలో ఉపయోగిస్తే ఆకులతో ప్లేట్లని తయారు చేస్తారు. పళ్ళతో హల్వా, బజియాస్, కట్‌లెట్స్ ఇలా దాదాపు 100కుపైె రుచికరమైన పదార్థాలని తయారుచేసుకునే అలవాటు అక్కడ కొన్నేళ్ళుగా కొనసాగుతోంది. గోవాని ఒకప్పుడు తమ ప్రధాన వ్యాపార కేంద్రంగా మార్చుకున్న పోర్చుగీస్ వారి ద్వారా 17వ శతాబ్దంలో ఈ పండు మొట్టమొదట బ్రెజిల్‌లోని బహియా ప్రాంతానికి చేరింది. అక్కడి నుండి 19వ శతాబ్దంలో ఆఫ్రికాలోని సావ్ టోమ్‌కి ప్రవేశించింది. అలా పనసపండు వివిధ దేశాలకి పరిచయమయ్యిందనే కథనాలూ ప్రచారంలో వున్నాయి. జాక్ ఫ్రూట్ ఫెస్టివల్ రోజున పనసతొనలతో చేసే వైన్, పాయసం, పుడ్డింగ్, జెల్లీ, జామ్, అప్పడాలతోపాటు స్థానికంగా పేరొందిన వంటకం పథల్యోనిని పండుగ నిర్వహించే ప్రాంతంలో స్టాళ్ళలో అమ్ముతుంటారు. అంతేకాదు వీటిని ఎలా తయారుచేసుకోవాలో తెలిపే వంటల పుస్తకాలని అమ్మకానికి వుంచుతారిక్కడ. సాధారణ రోజుల్లో కూడా పనసకాయలు, పండ్లతో రకరకాల వంటకాలని తయారుచేసి స్థానిక మహిళలు ఇళ్ళ వద్ద అమ్ముతుంటారు. అన్నంలో బాగా పండిన పనసతొనలని వుంచి ఆవిరి ద్వారా తయారుచేసే జాక్‌ఫ్రూట్ రైస్ కేక్ గోవా వాసుల ఫేవరెట్ డిష్. వివిధ ఆహార పదార్థాల తయారీకోసం ఇక్కడ పళ్ళు రెండు రకాలుగా దొరుకుతాయి. కాస్త గట్టిగా తీయగా వుండే 'కాపొ'తో భజియా, కట్లెట్ లాంటివి తయారుచేస్తే.... మరింత తియ్యదనంతోపాటు కాస్త గుజ్జు రూపంలో వుండే 'రసాల్' పండ్లతో స్వీట్లు, జామ్‌లని తయారుచేస్తారు. 'కాతల్ దే గోవా' బ్రాండ్ పేరుతో అమ్మే పనసపండుపై తొక్క ఉత్తర భారత్‌లోని చాలా ప్రాంతాల్లో ఫేమస్. దీన్నే అక్కడ కాతల్ అని పిలిచేసుకుంటారు. గోవావాసుల మాతృభాష కొంకణిలో దీని పేరు పొనొస్. పండుగ సమయంలో పనసపండ్లతో తయారుచేసిన పచ్చళ్లతో పాటు ఇలాంటి రుచికరమైన పదార్థాలన్నిటినీ తయారుచేస్తారు. వేడుకలో భాగమయిన వారందరికీ వలంటీర్లు ఈ పదార్థాలన్నిటినీ పనస ఆకులతో తయారుచేసే 'కోపెల్స్'లో అందిస్తారు. అటపాటలతో కేరింతలు కొట్టడమేకాదు....తలపై అందమైన పూల కిరీటాలతో పాటు, పూలతో అలంకరించిన బుట్టల్లో పనసపండ్లని వుంచి గోవావాసులు నిర్వహించే ప్రదర్శనతో సాయంత్రానికి ఈ వేడుక ముగుస్తుంది. గోవాతో పాటు కేరళ, కర్నాటక ప్రాంతాల్లోనూ ఈ పండుగ ఫేమస్ అయిపోయింది. ✦



ఇండెక్స్

ప్రత్యేకం 3
కళా గ్రామం

స్టార్........4
కళల తోట

నవ్వుల్ పువ్వుల్......... 5

వింత లోకం...........10
ఇక పళ్లు తోమరు

తెలుసా............... 11
మేఘ సందేశం

కవిత్వమ్...............14
గాజుల సవ్వడి

నల్లజాతి సూరీడు

అట్టమీది కథ...6

మిసమ్మ ఆపాత చిత్రం- 12

కథ 15
అందం

నా కళ్లతో 18
నేను చూసిన చైనా-2 భాగం

కొత్త పుస్తకాలు...........20
మనసు లోతుల్ని తడిమిన కథలు

రుచి.....................21
చికెన్ బ్రౌన్ రైస్ సూప్

బాల నేస్తాలు............23
నీలి రంగు సాలీడు

పద వికాసం........24

సాహస్ నచ్చింది

సోలార్ పవర్‌తో నడిచే ఆటో రిక్షాను తయారు చేసి, దానితో వాతావరణంలో కార్బన్ విషవాయువుల్ని ఎంతమేర తగ్గించుకోవచ్చునో ప్రజలకి తెలియ చేస్తున్న నవీన్‌కి అభినందనలు. పెన్సిల్ గీతలు నలుపు తెలుపు షేడ్స్‌తో సృష్టించిన చిత్రాలు, సెనిగవ్ ద్వీపాల్లో "నేచురల్‌గా ఏర్పడ్డ గులాబీరంగు నీటి సరస్సులు అమితంగా ఆకర్షించాయి. స్పోర్ట్స్‌కి అవసరమైన సాధనాలేవీ లేకున్నా 50.కి.మీ అంతర్జాతీయ ఆల్ట్రా మారథాన్‌లో విజయం సాధించిన మరియా లోరెనా జీవిత విశేషాలు అబ్బురపరిచాయి. యాసిడ్ దాడికి గురైన లలితా బెన్ లైఫ్‌లో చిత్రమైన మలుపులు చోటుచేసుకున్నాక స్నేహితుడిని వివాహం చేసుకోవడం, బాలీవుడ్ స్టార్ వివేక్ ఒబెరాయ్ వారికి చేయూత అందించడం సమాజంలో గొప్ప మానవతా సేవకి నిదర్శనం.

-టి. సత్యనారాయణ మూర్తి, విశాఖపట్నం.

సాహో చాకో



ఈ వారం స్నేహ అట్టమీది కథ సాహో చాకో చాక్లెట్ పుట్టు పూర్వోత్తరాలను కళ్లముందుంచింది. ఇది చదివిన తర్వాత చాక్లెట్‌కు ఇంత చరిత్ర ఉందా అనిపించింది. కొకొవా గింజల నుండి తయారైన చాక్లెట్ మొదట ద్రవరూపంలో ఉండి, ఆ తర్వాత చెక్కర మిశ్రమంతో నోరూరించే చాక్లెట్‌గా రూపాంతరం చెందటం గొప్పపరిణామం. చాక్లెట్ల అమ్మకాలు ప్రపంచ వ్యాప్తంగా కోట్ల రూపాయల్లో సాగుతున్నాయంటే అదంతా చాకో రుచి మహిమే అనటంలో ఎలాంటి సందేహం లేదు.

-మంకు శ్రీను, కొప్పర్రు.

యదార్థాలే యాస్తటిక్స్

సమాజంలో చోటుచేసుకుంటున్న అరాచకాలు, అకృత్యాలని ధైర్యంగా తెరకెక్కించిన దర్శకుడు ఆనంద్ పట్వర్ధన్ పరిచయం, కంప్యూటర్‌కు మనిషి బుర్ర సామర్థ్యాన్నిచ్చిన కృత్రిమ మేధ ఏఐ విశేషాలు బాగున్నాయి. మనిషి ఆలోచనా తీరుని రోబోల్లోకి చొప్పించే ఈ విధానాలు అబ్బురపరిచాయి. ఫ్లెక్సీ గొడుగులు, సాహోచాకో, నారీభేరి చదివించాయి. చివరి అట్టపై చినుకు స్టెప్పేస్తే చిత్రాలు ఆకట్టుకున్నాయి. తెలుసాలో ఫోబియాలపై ఇచ్చిన కథనం ఆకట్టుకుంది. నవ్వుల్ పువ్వుల్ నవ్వు తెప్పించాయి.

-అంకిత, విజయనగరం.

అబ్బురపరిచాయి

యాసిడ్ దాడికి గురై న లలితా బేన్ జీవితంలో అన్ని ఆటుపోట్ల తర్వాత తన స్నేహితుడిని వివాహం చేసుకోవడం ఓ మంచి పరిణామం. కృత్రిమ మేధ ఏఐలు, చాక్లెట్ రుచులు అబ్బురపరిచాయి. 'బంగారంతో సమానంగా', 'కోటింగ్ వేస్తే', 'వరసగా 2000 రోజులు' 'ఫ్లెక్సీ గొడుగు', 'క్రికెట్ నారీ భేరీ', కవితలు బాగున్నాయి. నవ్వుల్ పువ్వుల్ నవ్వు తెప్పించాయి.

- గణేష్, విశాఖపట్నం

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-520002.
మెయిల్ అడ్రస్: snehaweekly.praja@gmail.com

ప్రత్యేకం

కళా గ్రామం

శిల్పగ్రామ్, దక్షిణ్ చిత్రా, కచ్, తంజావూరు, కొండపల్లి, ఏటికొప్పాక పేరువినగానే మనకి రంగురంగుల బొమ్మలు గుర్తొస్తాయి. ఒడిశాలోని ఓ గ్రామం మాత్రం గోడచిత్రాలకి ఫేమస్ అయిపోయింది. ప్రతి ఇంటిగోడపై తీర్చిదిద్దిన ఆ చిత్రాలన్నీ కళాకారుల సృజనకి అద్దంపడతాయి. గోడచిత్రాలతోపాటు చక్కటి హస్తకళలు, తాటి, కొబ్బరాకులతో చేసే రకరకాల బొమ్మలు, కలప, శిలలపై చెక్కే విగ్రహాలు, సిల్కు వస్త్రాలపై వేసే తుస్సార్ అద్దకాలు ఇలాంటి ప్రత్యేకతలెన్నో ఆ గ్రామంలో వున్నాయంటే ఈ ఊళ్ళో ఎంతమంది కళాకారులున్నారో అర్థంచేసుకోవచ్చు.. అరుదైన కళాసంపదలతో ఆదర్శ కళాగ్రామంగా గుర్తింపుతెచ్చుకున్న ఆ ఊరి గురించి మీరూ చదివి తెలుసుకోండి.

ఒడిశాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతం పూరి. పూరిలోని ఒక మారుమూల గ్రామం రఘురాజాపురం. ఈ గ్రామంలోకి అడుగుపెట్టీపెట్టగానా ఇంటి గోడలపై తీర్చిదిద్దిన రకరకాల పెయింటింగ్స్ మనకి స్వాగతం పలుకుతాయి. ఇక్కడి ప్రతి ఇల్లూ ఇలా అందమైన రంగులని అద్దివుండడం చూస్తే చాలా ఆశ్చర్యం వేస్తుంది. అయితే ఎక్కువమందికి తెలియని విషయం ఏంటంటే.... ఆ గ్రామంలో నివసించేవారందరూ కళాకారులే. తాటి, కొబ్బరాకులతో మలిచే చక్కటి హస్తకళలతోపాటు రకరకాల బొమ్మలు, చెక్కపై తీర్చిదిద్దే తీగెలు, నెమ ళ్ళు, రాతి శిలలపై చెక్కే విగ్రహాలు. సిల్కు వస్త్రాలపై వేసే తుస్సార్ అద్దకాలు, సున్నం రాళ్ళతో చేసే బొమ్మలు ఇలా ఏదో ఒక కళలో వారంతా సిద్ధహస్తులే. మూడు వందలమందికి పైగా కళాకారులున్న ఈ గ్రామంలో వందకిపైగా కుటుంబాలు చిత్రకళపై ఆధారపడి జీవిస్తున్నాయి. ఒడిశాలోని పెద్ద పెద్ద కోటలు, రాజభవనాలకి నగిషీలు అద్దేందుకు ఎక్కువగా పనిచేసింది ఈ గ్రామస్తులే. అలా రఘురాజాపురం ఖ్యాతి పక్క రాష్ట్రాలకీ పాకిపోయింది. ఇక ఈ గ్రామంలో ప్రతి ఇంటి గోడలపై ఏదో ఒక పెయింటింగ్ కనిపిస్తుంది. కళాకారులు అందంగా తీర్చిదిద్దే ఆ 'పట్టచిత్రాలు' అన్నీ కళ్ళని తిప్పుకోనీకుండా చేస్తాయి. వీళ్ళని అక్కడ చిత్రకాస్ అని పిలుస్తారు. పట్ట అంటే గీయడం, చిత్రక అంటే పెయింటింగ్ అనే అర్థం వుంది. ఈ చిత్రకళకు సంబంధించి 12వ శతాబ్దానికి చెందిన ఆనవాళ్ళు ముడిపడి వున్నాయి. కొన్నేళ్ళ క్రితం వరకు జగన్నాథ చిత్రాలని ఇంటిగోడలకు వేసే ఆచారం వుండేదక్కడ. ఇప్పుడు మాత్రం సామాజిక జీవనాన్ని అద్దంపట్టే బొమ్మలతో ఈ చిత్రశైలిలో కొన్ని మార్పులు చోటుచేసుకుంటున్నాయి. నిజానికి బెంగాల్ నుంచి పూరి వచ్చిన ఓ యాత్రికుడి ద్వారా ఈ గ్రామ వాసులకి సామాజిక అంశాల ఆధారంగా పెయింటింగ్స్‌ని వేసే కళ అబ్బింది. అప్పట్లో గోడలపై బొగ్గుతో చిత్రాలని వేసేవారు. పూరి జగన్నాథుడి ముఖ చిత్రాలని నలుపు రంగులోనే అద్దడానికి అప్పటి ఆ కళారూపాలే కారణం. సున్నపు రాళ్ళు, బొగ్గుని ఉపయోగించి గీసే అప్పటి చిత్రాల్లో కాలానుగుణంగా రంగులని అద్దడం మొదలయ్యింది. ఇంటి గోడలని రంగులతో తీర్చిదిద్దడంతో పాటు చక్కటి హస్తకళలు, తాటి, కొబ్బరాకులతో మలిచే రకరకాల బొమ్మలు, కలప, శిలలపై చెక్కే కళాఖండాలు, సిల్కు వస్త్రాలపై వేసే తుస్సార్ అద్దకాల కళల్లో ఇప్పటి చిన్నారులూ ఆరితేరుతున్నారు. ఈ హస్తకళల్ని విదేశీయులకి తొలిసారి పరిచయం చేసిన మహిళ హెలెన్ జెర్సీ అనే కథనాలున్నాయి. అమెరికా నుంచి పూరికి వచ్చిన ఈ యాత్రికురాలు తన తిరుగు ప్రయాణంలో రఘురాజ్‌పురానికి వచ్చింది. ఇక్కడి కళాకారులు తయారుచేసిన హస్తకళలని వెంటతీసుకెళ్ళడంతో పాటు ఇంటిగోడలపై తీర్చిదిద్దిన్న ఆ చిత్రాలన్నింటినీ తన బ్లాగ్‌లో పొందుపరిచింది. ఒడిశా సాంప్రదాయ కళారూపాలతోపాటు వివిధ రీతుల్లో ఇక్కడి కళాకారులు తయారుచేసే బొమ్మలు తయారీ దారులే ఇంటిముందు స్టాల్స్‌లో వుంచి అమ్ముతుంటారు. ఒడిశా ఖ్యాతిని ప్రపంచస్థాయికి తీసుకెళ్లిన రఘురాజాపురం అక్కడి ప్రభుత్వం ద్వారా 2000లో హెరిటేజ్ గ్రామంగా గుర్తించబడింది. విదేశీ యాత్రికులు రఘురాజపూర్ బొమ్మలని కొనేందుకు ఇక్కడికి వచ్చిపోవడమే కాదు అరుదైన ఆ కళాఖండాలని నేర్చుకునేందుకు ఆసక్తిచూపుతున్నారు.

- శర్వాణి

స్టార్

అది సెట్టో నిజమైన కట్టడమో తెలిసేది సినిమాలో చేసినవారికి మాత్రమే. ప్రేక్షకుడు ఈ డొల్లేమి లేకుండా సినిమాని ఆస్వాదిస్తాడు. అంత సహజంగా ఉంటుంది తోట తరణి ఆర్ట్. ఆయన ప్రతిభకు కొలువు దీరింది 'అర్జున్' చిత్రంలోని మధుర మీనాక్షి ఆలయ సెట్. ఏడు పదులకు దగ్గరవుతున్నా ఇంకా సృజన రంగానికి కొత్త అందాల్ని అద్దుతూనే ఉన్నారాయన. ఈమధ్యే 'ఉయ్యాలవాడ నరసింహారెడ్డి' కథాంశంతో తెరకెక్కుతున్న చిరంజీవి చిత్రానికి ఆయన్నే తీసుకున్నారు. చారిత్రక, స్వాతంత్ర్య పోరాట ఇతివృత్తమున్న ఈ చిత్రం ప్రేక్షకుల్ని ఆ కాలంలోకి తీసుకెళ్లాలంటే తోట తరణి చేయి తిరగాల్సిందే. ఈ ఆర్ట్ మేస్త్రీ గురించి కొన్ని వివరాలు...

కళల తోట

- 1949 డిసెంబర్ 16న చెన్నైలో తరణి జన్మించారు. తండ్రి తోట వెంకటేశ్వరరావు దర్శకులు. అప్పటి మద్రాస్ తెలుగు, తమిళ్, హిందీ, మలయాళ చిత్రాలకు నిలయంగా ఉండేది. ప్రపంచంలోని దాదాపు సగం చిత్రాలు అప్పట్లో అక్కడే తయారయ్యేవి అంటే ఆశ్చర్యం లేదు.
- నాలుగైదేళ్లకే పెయింటింగ్ మీద మనసు పారేసుకున్న తరణి 12 ఏళ్ల నుంచే తండ్రికి అసిస్టెంట్‌గా సృజన రంగంలోకి ప్రవేశించాడు. అలా రాజ్ కపూర్, ఎంజీఆర్ వంటి మూవీ లెజెండ్స్‌ను దగ్గరగా చూశాడు.
- 1970లో కృత్రిమ వస్తువులతో సహజంగా రాక్ ఎఫెక్ట్ తెచ్చేందుకు తండ్రితో కలసి పనిచేయడం... అతణ్ని కళా దర్శకత్వం వైపు మరింత ఆకర్షించింది.
- మ్యూరల్ పెయింటింగ్‌లో గ్రాడ్యుయేట్ డిప్లొమా చేశాక ఫ్రాన్స్ ప్రభుత్వం నుంచి ఆయనకు ప్రింట్ మేకింగ్‌లో ఫెలోషిప్ అవకాశం కలిగింది.
- రాయల్ కాలేజీ ఆఫ్ ఆర్ట్స్ లండన్, న్యూఢిల్లీలోను ఆయన కళా విద్యను అభ్యసించారు.
- 1978లో వచ్చిన 'సొమ్మొకడిది-సోకొకడిది' చిత్రంతో ఆయన కళా విభాగంలో ప్రవేశించారు. తర్వాతి తెలుగు చిత్రం 'శుభలేఖ' (1982) వచ్చింది. మిగతా భాషా చిత్రాలకు పనిచేయడం మొదలెట్టారు.
- 'నాయగన్' చిత్రానికి వేసిన సెట్‌లతో ఆయన పేరు సంపాదించారు. అప్పట్లో థర్మాకోల్ షీట్లను టీవీ షాపుల నుంచి అడిగి తెచ్చుకునే అవస్థల్లాంటివి ఎక్కువగా ఉండేవట.



- అంజలి, దళపతి, బాంబే, ప్రేమ దేశం, ఖుషీ, దశావతారం, శివాజీ, జెంటిల్‌మేన్, చంద్రముఖి, జీన్స్, భారతీయుడు, శుభ సంకల్పం, శివ, ఇంద్రుడు-చంద్రుడు, సాగరసంగమం, పల్లవి అనుపల్లవి వంటి చిత్రాలు ఆయన ఖ్యాతిని మరింత పెంచాయి.
- ఈమధ్య వచ్చిన బ్రహ్మోత్సవం, ఎలీ, రుద్రమదేవి, లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్, లీడర్, కుచేలన్ చిత్రాలతో ఆయన ఇంకా బిజీగానే ఉన్నారు.
- 'చూడాలని ఉంది' చిత్రానికి గాను ఆయన వేసిన కోల్‌కతా వీధి సెట్ అబ్బురపరుస్తుంది. అది ఎంతో సహజంగా కనిపిస్తుంది.
- ఎంత వైవిధ్యమైన కట్టడానికైనా నకలును సెట్ వేయడంలో ఆయన దిట్ట. అలా వేసిందే మధుర మీనాక్షి ఆలయం. అప్పట్లోనే నాలుగు కోట్ల రూపాయలతో వేసిన ఈ భారీ సెట్‌లో 1000కి పైగా విగ్రహాలు, చిహ్నాలను మలిచారు.
- గండిపేటలో 320 అడుగుల పొడవు, 200 అడుగుల వెడల్పు, 125 అడుగుల ఎత్తుతో నిర్మించిన ఈ సెట్‌ను ఆరు నెలల్లో నిలబెట్టారు. మొత్తం 400 మంది కార్పెంటర్లు, 200 మంది పెయింటర్లు పనిచేశారు.
- వందకు పైగా తెలుగు, తమిళ్, మలయాళ, కన్నడ, హిందీ చిత్రాలకు ఆయన కళా దర్శకులుగా పనిచేశారు. 200కు పైగా మూవీ సెట్లను రూపొందించారు.
- పాండిచేరి, డెర్నియర్ కంపొటైర్ డెస్ ఇండెస్, హనుమాన్ (ఫ్రెంచ్), బ్రాంచీ (ఇటాలియన్), డ్యామ్ 999 (ఇంగ్లీష్) వంటి విదేశీ చిత్రాలకు తన సృజనను అందించారు.
- మూడు సినీ పరిశ్రమల్లో ఉత్తమ కళా దర్శకుడిగా ఆయన సత్కారాలు పొందాడు.
- 2001లో ఆయన ప్రతిభను గుర్తించి 'పద్మశ్రీ'తో కేంద్ర ప్రభుత్వం సత్కరించింది.
- జపాన్‌లోని టొయామా 'లివింగ్ సీజన్స్' (1992), ప్యారిస్ 'అటెలీర్' వర్క్‌షాప్, రాజస్థాన్ ఫ్రెస్కో పెయింటింగ్ క్యాంపు, న్యూఢిల్లీ గార్హీ గ్రాఫిక్ వర్క్‌షాప్‌ల్లో ఆయన పాల్గొన్నాడు.
- ప్యారిస్, బోర్డీయాక్స్, వియన్నా, యుగోస్లావియా, జర్మనీ, కంగావా, బార్సిలోనాలో ఏర్పాటు చేసిన కళా ప్రదర్శనలకు వెళ్లారు.
- పగలు సినిమాలకు పనిచేస్తూ... రాత్రుళ్లు చిత్రలేఖనానికి అంకితమవుతారు.
- శేఖర్ కపూర్, నందితా దాస్‌తో కలిసి గాంధీజీ ఆత్మకథ 'ది స్టోరీ ఆఫ్ మై ఎక్స్‌పెరిమెంట్స్ విత్ ట్రూత్' ఆడియో బుక్‌ను తెచ్చారు. దీని కవర్‌కు ఆయన వేసిన ఇల్లస్ట్రేషన్స్ ఆ పుస్తక సారాన్ని ప్రతిబింబిస్తాయి.
- సి.నా.రె.తో కలిసి విశాఖలోని తెలుగు సాంస్కృతిక, వారసత్వ ప్రదర్శన శాలకు పనిచేశారు.
- చిత్రలేఖనంలోను ప్రత్యేకతను చాటుకున్న తరణి ఎక్కువగా నాన్‌ఫిగరేటివ్ ఆర్ట్‌నే ఆవిష్కరిస్తారు. అద్భుతమైన రంగుల మేళవింపుతో ఉండే ఆ పెయింటింగ్స్‌కు చాలామంది అభిమానులే ఉన్నారు.
- క్యాలీగ్రఫీని కూడా ఆయన ఇష్టపడతారు. తన ఇంటి పేరు 'తోట'ను ప్రతీకగా తీసుకుని అక్షరాల లతల్ని చిత్రాలుగా అల్లారు. ప్రతి లిపికి చెందిన అక్షరాలు అద్భుతంగా ఉంటాయని 'స్క్రిప్ట్ సిరీస్'ను నడిపించారు.
- సహజంగా కనిపించని సెట్‌లు వేసి ఏం ప్రయోజనమనే తరణి చిత్ర షూటింగ్ ముగిసి వాటిని ధ్వంసం చేసేపుడు అక్కడ ఉండలేరు. వాటిని అలా చూడలేరు. ✦

నవ్వుల్ - పువ్వుల్

రివర్స్



జైలర్: నీకు ఈ రోజే ఉరిశిక్ష వేస్తాం. చివరికోరిక ఏంటో చెప్పు?

ఖైదీ: అయితే నన్ను తలకిందులుగా ఉరి తీయండి సార్ చాలు!

గతం

టీచర్: బంటి 16వ శతాబ్దం నాటి రాజుల గురించి నీకేమైనా తెలుసా ??

బంటి: తెలుసు

టీచర్: ఏం తెలుసో చెప్పు

బంటి: వాళ్ళంతా చనిపోయారని

టీచర్: ఆ.....

అనుకున్నదే

చరణ్: కిరణ్ ఇప్పుడేం చేస్తున్నావ్.

కిరణ్: చిన్నప్పుడు నేనేం కావాలనుకున్నానో అదే అయ్యాను.

చరణ్: ఏం కావాలనుకున్నావ్?

కిరణ్: పెద్ద వాణ్ణి కావాలనుకున్నాను.....

కిసుక్కు

వెంగళప్ప: అప్పు నీ ఫోన్ నుంచి ఎంత సేపట్నించీ నంబర్ డయిల్ చేస్తున్నా వెళ్ళట్లేదేంట్రా.

అప్పు: ఉరేయ్... అది మినీ క్యాలికులేటర్ రా....!!!

అతి తెలివి



భార్య : అదేంటండీ! కొత్త బండిని అలా తోసుకుంటూ వస్తున్నారు.

భర్త: కొత్త బండికదా అస్తమానం స్టార్ట్‌చేస్తే పాడైపోతుందని!

కిసుక్కు సిత్రం



ఎనకోడి హడావిడేందిరా బాబు!



నాకు నచ్చిన చిత్రం

ఇల్లస్ట్రేటర్: ఇగోర్ మురోస్కి

సేకరణ: కె.లక్ష్మణ్, విజయనగరం

నల్లజాతి సూరీడు

అట్టమీది కథ

వివక్ష, అణచివేతలకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాలకు స్ఫూర్తినిచ్చిన నాయకుడు. దక్షిణాఫ్రికాలోని శ్వేతజాతి దురహంకారుల పాలన నుండి నల్లజాతి ప్రజలను విముక్తి చేయటానికి జీవితాన్ని పణంగా పెట్టి పోరాడిన విప్లవ యోధుడు. 28 ఏళ్లపాటు జైలు జీవితం గడిపినా ఉద్యమం ఊపిరిని వదలని ధీరుడు నల్ల జాతి సూరీడు నెల్సన్ మండేలా. ఆయన శతజయంతి కార్యక్రమాలు మొదలయ్యాయి. ఓ ఏడాది ముందే వాటిని నిర్వహించడానికి ఓ ప్రత్యేకత ఉంది. బలమైన కారణం ఉంది. మదీబా స్నేహం సహానుభూతి ఉంది. మండేలా ఓ ఉద్యమస్ఫూర్తి. అందుకే ఆ ప్రత్యేక పుట్టిన రోజు సందర్భంగా అట్టమీది కథ.



ఎకెఆర్

9490098626

నల్ల జాతి సూరీడిగా ఆయన పరిణామం చెందడానికి బాల్యం, స్నేహాల ప్రభావం ఎక్కువగానే ఉంది. వివక్ష మధ్య నలిగిన ప్రతి రోజు బలమైన ముద్ర వేసింది. అందుకే జైల్లో అన్నేళ్ల పాటు ఉన్నా మదీబా గుండె చెక్కుచెదరలేదు. మండేలా గొంతు మంట ఆరలేదు. రోలిహ్లాహ్లా గుండె బెదరలేదు. యువకుడిగా జైలులోకి వెళ్లే ముందు ముదుసలిగా బయటకు వచ్చే వరకు ఆయన విప్లవ తేజం వసివాడలేదు. మండేలా శతజయంతిని ఆయన స్థాపించిన నెల్సన్ మండేలా ఫౌండేషన్ బృందం అధికారికంగా ఓ ఏడాదికి ముందు నుంచే నిర్వహించడానికి కారణం ఆయన ప్రాణ మిత్రుడు ఆలీవర్ టాంబూనే. ఆయన శతజయంతి ఈ ఏడాదే. ఈ ఇద్దరు మిత్రుల బాల్య స్నేహం 13, 12 ఏళ్ల వయస్సు నుంచి మొదలై విప్లవానికి ఒకరు అమరయ్యాక కూడా జ్ఞాపకాల్లో సాగిపోయింది. టాంబూ లేని మండేలాని ఊహించలేమనే మాట అందుకే వచ్చింది. ఓ రకంగా ఈ ద్వయం శత జయంతిగా దీన్ని తీసుకున్నారు. ఇద్దరూ కలిసి ఆఫ్రికాలో మొదటి నల్ల జాతీయులు నడిపే న్యాయ సంస్థను ఏర్పాటు చేశారు. అదే ఓ ఉద్యమ సోపానంగా మారింది. అపార్థెడ్ రెజీమ్‌ను కూలదోసే ప్రయత్నంలో ఒకరు జైలు పాలయ్యారు. మరొకరు దేశ బహిష్కరణకు గురయ్యారు. అందుకే మండేలా నూరో పుట్టిన రోజుని ముందే ఆ స్నేహానికి పంచారు.

తాత తరం నుంచే...

నెల్సన్ రోలిహ్లాహ్లా మండేలా 1918 జులై 18న దక్షిణాఫ్రికా కేప్ ప్రాంతంలోని ఉమ్‌టాటా మెవ్‌జో గ్రామంలో థెంబు రాజవంశీయుల కుటుంబంలో జన్మించాడు. ఆయన తండ్రి గాడ్లా హెన్రి పకనియిస్వ, తల్లి నోసెకిని ఫన్ని. ఆమె ఆయన తండ్రికి మూడవ భార్య. దక్షిణాఫ్రికాలోని కేప్ ప్రాంత ట్రాన్స్‌కీయన్ ప్రాంతంలోని థెంబు ప్రజలను ఆయన తాత గుబెంగ్‌కూకా పాలించాడు. మండేలా తండ్రి స్థానిక పాలకుడు. 1926లో అవినీతి ఆరోపణలను చేస్తూ ఆయనను రాజు తొలగించాడు. వాస్తవం ఏమిటంటే ఆయన న్యాయాధిపతి హేతు విరుద్ధ పద్ధతులకు అనుగుణంగా పనిచేయకపోవటంతో పదవిని కోల్పోయాడు. మండేలాకు ముందు ఆయన కుటుంబ సభ్యులు ఎవరూ పాఠశాలకు హాజరుకాలేదు. మండేలా పాఠశాలకు వెళ్ళిన మొదటి రోజునే అప్పటి ఆచారం ప్రకారం ఉపాధ్యాయిని ఆయనకు 'నెల్సన్' అనే ఇంగ్లీష్ పేరుపెట్టింది. ఇది వలస పాలన మిగిల్చిన మచ్చ. అందుకే మండేలాగానో, మదీబాగానో ఆఫ్రికా పిలుస్తూ ఓ రకమైన నిరసన, మూలాల్ని మిగుల్చుకునే తపన పడుతుంది. ఆయన తొలి జీవితం థెంబు తెగ ఆచారాలు, సాంప్రదాయాల మధ్య గడిచింది. ఆయన తల్లి, ఇద్దరు చెల్లెళ్ళతో కలిసి కును గ్రామంలో పెరిగాడు. అక్కడ ఆయన పశువులను కాస్తూ ఇతర బాలురతో కలిసి ఎక్కువ సమయం బయటనే గడిపేవాడు.

కథ మారింది

మండేలా తల్లి ఆయనను క్వెక్‌జెనిలోని గ్రేట్ ప్యాలెస్‌కు తీసుకువెళ్ళింది. అక్కడ థెంబు రాజ ప్రతినిధి జొంగిన్‌టాబా డలిన్‌డైబో సంరక్షణలోకి వెళ్ళాడు. ఆయన, ఆయన భార్య నోయెన్‌గ్లాడ్ మండేలాను తమ కుమారుడు జస్టిన్, కుమార్తె నొమాఫుతో సమానంగా చూసుకున్నారు. రాజభవనానికి పక్కనే ఉన్న మెథడిస్ట్ మిషన్ స్కూల్‌లో ఆయన చదువుకున్నాడు. తరచుగా రాజభవనానికి వచ్చే ముఖ్యాధికారి జోయి ప్రభావంతో చరిత్రపై ఆసక్తి, సామ్రాజ్యవాద వ్యతిరేకత పెరిగింది. ఇతర విద్యార్థులతో కలిసిమెలిసి తిరగటంతో ఒంటరిగా ఉండే స్వభావం నుండి బయటపడ్డానని ఓసారి చెప్పాడు. ఆయనకు జీవితాంతం ఇష్టమైనదిగా ఉన్న తోటల పెంపకాన్ని అక్కడే నేర్చుకున్నాడు. జూనియర్ సర్టిఫికెట్ కోర్సును ఆయన రెండు సంవత్సరాలలో పూర్తిచేశాడు. హెల్డ్‌టౌన్‌లోని ఫోర్ట్ బ్యూఫోర్ట్‌లోని థెంపు రాజకుటుంబీకులు ఎక్కువ మంది హాజరయే మెథడిస్ట్ కాలేజీలో జస్టిస్‌తో కలిసి 1937లో చేరాడు. అక్కడి ఉపాధ్యాయుడు ఇంగ్లీష్ పాలన, సంస్కృతి ఆధిక్యతను గూర్చి చెప్పేవాడు. మండేలాకు స్థానిక సంస్కృతి, చరిత్ర ఆసక్తి ఉండేది. హెల్డ్‌టౌన్‌లో ఆయన తన విద్యాభ్యాసానికి పోనూ మిగిలిన సమయాన్ని పరుగు, బాక్సింగ్ నేర్చుకోవటం కోసం వినియోగించేవాడు.

విద్యార్థి తిరుగుబాటు

మండేలా బిఎ డిగ్రీ కోసం 1939లో ఫోర్ట్‌హేరే యూనివర్సిటీలో చేరాడు. వెస్లీహౌస్ డార్మిటరీలో మండేలా ఉండేవాడు. ఆయనకు జీవితాంతం మిత్రుడుగా ఉన్న ఆలీవర్ టాంబూ అక్కడ ఆయనతో కలిసి ఉన్నాడు. అబ్రహాం లింకన్‌ను గురించిన నాటకాలలో నటించేవాడు. మొదటి సంవత్సరం

పూర్తయిన తర్వాత ఆహారం నాణ్యత బాగా లేదని బాయ్‌కాట్ చేయటంతో ఆయనను యూనివర్సిటీ నుండి తాత్కాలికంగా సస్పెండ్ చేశారు. ఆయన తర్వాత తన డిగ్రీని పూర్తిచేయటానికి తిరిగి రాలేదు.

పెళ్లి అని పారిపోయి

మండేలాకు పెళ్ళి కుదర్చటంతో జస్టిస్‌తో కలిసి జోహన్స్‌బర్గ్‌కు పారిపోయాడు. అక్కడ క్రౌన్‌మైన్స్‌లో వాచ్‌మన్ ఉద్యోగం దొరికింది. కాని పారిపోయి వచ్చాడని తెలియటంతో ఉద్యోగం నుండి తొలగించారు. ఆయనతో కలిసి ఉంటున్న బంధువు ఆయనను ఎయన్‌సి కార్యకర్త వాల్టర్ సిసులుకు పరిచయం చేశాడు. సిసులు ఆయనకు ఒక కంపెనీలో గుమాస్తా ఉద్యోగం ఇప్పించాడు. ఆ కంపెనీలో ఎయన్‌సి, కమ్యూనిస్టు పార్టీ సభ్యులతో మండేలాకు పరిచయాలు ఏర్పడ్డాయి. కమ్యూనిస్టుల సమావేశాలకు హాజరయ్యేవాడు. అక్కడ యూరోపియన్లు, ఆఫ్రికన్లు, భారతీయులు, వివిధ రంగు జాతుల ప్రజలు ఒక్కటిగా కలిసిపోవటం ఆయనను ఆకర్షించింది.

ఒక్కడే

మండేలా న్యాయశాస్త్రాన్ని అభ్యసించటం కోసం విట్ వాటర్ స్రాండ్ యూనివర్సిటీలో చేరాడు. అక్కడ ఆయన ఒక్కడే నల్లజాతి విద్యార్థి. అక్కడే ఆయనకు జాతి వివక్ష ఎదురైంది. అక్కడ ఆయనకు ఉదారవాదులు, కమ్యూనిస్టులైన యూరోపియన్, యూదు, భారతీయ విద్యార్థులతో సంబంధాలు ఏర్పడ్డాయి. రాజకీయ చైతన్యం పెరగటంతో 1943లో జరిగిన బస్‌ఛార్జీల పెంపుదలను ఉపసంహరించుకోవాలని జరిగిన ఉద్యమంలో పాల్గొన్నాడు. ఎయన్‌సిలో చేరిన తర్వాత వాల్టర్ సిసులు ప్రభావం ఆయనపై పడింది. ఇతర ఎయన్‌సి కార్యకర్తలతో కలిసి వోర్లాండోలోని సిసులు ఇంటి వద్దనే ఎక్కువ సమయం గడిపేవాడు. బానిసత్వానికి వ్యతిరేకంగా యువతను సమీకరించేందుకు 1944లో లెంబెడె అధ్యక్షునిగా ఎయన్‌సి యువజన విభాగం ఏర్పడింది. మండేలా ఎగ్జిక్యూటివ్ కమిటి సభ్యునిగా ఉన్నాడు.

ప్రేమ-ఉద్యమం

ఎయన్‌సి కార్యకర్త, నర్స్ ట్రెనింగ్‌లో ఉన్న ఎవెలిన్ మాసెను మండేలా 1944లో కలిశాడు. అదే సంవత్సరం అక్టోబర్‌లో వారిరువురూ వివాహం చేసుకున్నారు. 1945లో వారికి కుమారుడు మదీబా థెంబి థెంబకైల్ పుట్టాడు. కుమార్తె మెకాజివి 1947లో పుట్టింది. కాని మెనింజైటిస్‌తో తొమ్మిది నెలలకే మరణించింది. ప్రభుత్వ, జాతి వ్యతిరేక విధానాలు తీవ్రం కావటంతో జాతి వివక్షకు వ్యతిరేకంగా దక్షిణాఫ్రికాలోని భారతీయులు చేసిన కార్యక్రమాలతో ప్రభావితమై సమ్మెలు, బాయ్‌కాట్‌లు లాంటి ప్రత్యక్ష కార్యాచరణకు పోవాలని అలాంటి పరిస్థితులలోనే నిర్ణయం తీసుకున్నాడు. సిసులు, యండా, టాంబూ, గాడ్‌ఫ్రే పిట్జేలతో మరింత మిలిటెంట్ ఎగ్జిక్యూటివ్ కమిటీని ఎన్నుకున్నారు. తాను, తన

సహచరులు కలిసి ఎయన్‌సిని మరింత తీవ్రవాద పంథాకు తీసుకొచ్చామని మండేలా తర్వాత చెప్పేవాడు. తన సమయంలో ఎక్కువ భాగాన్ని రాజకీయాలకు కేటాయించటంతో న్యాయ శాస్త్రం చివరి సంవత్సరం పరీక్షలలో మండేలా మూడుసార్లు తప్పాడు.

ప్రతిఘటన-జైలు

జాతి వివక్షకు వ్యతిరేకంగా భారతీయులు, కమ్యూనిస్టు గ్రూపులతో కలిసి ఉమ్మడి పోరాట కార్యక్రమానికి ఎయన్‌సి ప్రణాళిక రూపొందించింది. మహాత్మాగాంధీ కార్యక్రమాలతో ప్రభావితమై దీనిని అహింసతో అమలు చేయాలని కార్యక్రమాన్ని రూపొందించారు. 10 వేల మంది హాజరయిన డర్బన్ మీటింగ్‌లో ప్రతిఘటన కార్యక్రమాన్ని మండేలా ప్రారంభించాడు. అందుకుగాను ప్రభుత్వం ఆయనను అరెస్ట్ చేసి, మార్షల్ స్క్వేర్ జైలులో కొద్దికాలం నిర్బంధించింది. దక్షిణాఫ్రికాలో మండేలా నల్లజాతి నాయకులలో ముఖ్యుడని ఈ ఘటనలు స్పష్టం చేశాయి. నిరసనలు పెరగటంతో ఎయన్‌సి సభ్యత్వం 20 వేల నుండి లక్షకు పెరిగింది. ప్రభుత్వం సామూహిక అరెస్టులకు పూనుకున్నది. 1953లో 'మార్షల్ లా' విధించటానికి అవకాశం కల్పించే పబ్లిక్ సేఫ్టీ యాక్ట్‌ను అమలులోకి తెచ్చింది. ట్రాన్స్‌వాల్ ఎయన్‌సి అధ్యక్షుడు జె బి మార్క్స్ బహిరంగంగా కార్యక్రమాలలో పాల్గొనకూడదని అధికారులు నిషేధం విధించడంతో ఆ బాధ్యతల నిర్వహణను మండేలాకు అప్పగించాడు.

అణచివేత - ఫ్రీడమ్ చార్టర్

1952 జులైలో 'సప్రెషన్ ఆఫ్ కమ్యూనిజం' యాక్ట్ కింద జోహన్నెస్‌బర్గ్‌లో అరెస్ట్ చేసిన 21 మందిలో మెరోకా, సిసులు, యూసుఫ్ దాదూతో పాటు మండేలా కూడా ఉన్నాడు. తన పాలనకు అత్యంత వ్యతిరేకులను ప్రభుత్వం 'స్టేట్యూటరీ కమ్యూనిజం' పేరుతో శిక్షించటానికి పూనుకుంటున్నది. దానిలో భాగంగా వీరికి తొమ్మిది నెలల శిక్ష విధించి, తర్వాత రెండు సంవత్సరాలకు పొడిగించారు. మండేలా ఒకే సమయంలో ఒకరికి మించి ఎక్కువ మందితో మాట్లాడకూడదని ఆరు నెలల నిషేధం విధించారు. మండేలా తన ట్రాన్స్‌వాల్ ప్రాంత అధ్యక్ష బాధ్యతలు నిర్వహించటం అసాధ్యంగా మారింది.

జోహన్నెస్‌బర్గ్‌లోని సోఫియా వీధిలోని నల్లవారినందరినీ వేరేచోటికి తరలిస్తున్న ప్రభుత్వ ప్రయత్నానికి వ్యతిరేకంగా 1955 ఫిబ్రవరిలో చేసిన పోరాటం విఫలమైంది. జాతి వివక్ష, శ్వేతజాతి మైనారిటీ పాలనను అంతం చేయటానికి హింసాపూరితమైన కార్య క్రమాలు నిర్వహిం చటం అవసరం అని మండేలా చెప్పాడు. ఆయన అభ్యర్థనతో ఆయుధాలు కావాలని సిసులు చైనాను

అభ్యర్థించాడు. గెరిల్లా పోరాటం జరిపే స్థాయికి చేరుకోలేదని భావించి ఆ అభ్యర్థనను చైనా తిరస్కరించింది. దక్షిణాఫ్రికా భారతీయ కాంగ్రెస్, రంగుజాతుల ప్రజల కాంగ్రెస్, దక్షిణాఫ్రికా కార్మిక సంఘాల కాంగ్రెస్, డెమోక్రాట్స్ కాంగ్రెస్‌లు కలిసిరావటంతో ప్రజా కాంగ్రెస్‌ను జరిపి శ్వేతజాతి ప్రభుత్వానంతర వ్యవస్థను గురించి ప్రజలందరూ ప్రతిపాదనలు పంపాలని విజ్ఞప్తి చేసింది. ప్రజల నుండి వచ్చిన స్పందనతో ఫ్రీడం చార్టర్‌ను తయారుచేసింది. ప్రజాస్వామ్యబద్ధమైన, జాతి వివక్షలేని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి ప్రధాన పరిశ్రమలన్నింటినీ జాతీయం చేయాలని ఫ్రీడం చార్టర్‌లో చెప్పారు. క్లిప్‌టౌన్‌లో 1955, జూన్‌లో 3,000 మంది ప్రతినిధులతో జరిగిన కాన్ఫరెన్స్‌లో ఫ్రీడం చార్టర్‌ను ఆమోదించారు.

మూడోసారి...

పిఏసి నిర్వహించిన ఒక ప్రదర్శనపై షార్ప్‌విల్లెలో పోలీసులు జరిపిన కాల్పులలో 69 మంది మరణించారు. ఈ ఘటనపై దక్షిణాఫ్రికా ప్రభుత్వాన్ని ప్రపంచవ్యాపితంగా ఉన్న ప్రజాతంత్రవాదులు, ప్రభుత్వాలు, సంస్థలు ఖండించాయి. దీనికి నిరసనగా దక్షిణాఫ్రికా అంతటా ఘర్షణలు చెలరేగాయి. ఉద్యమానికి సంఘీభావంగా మండేలా తన పాస్‌ను బహిరంగంగా దగ్ధం చేశాడు. ప్రజాఉద్యమాలలో పాల్గొనకుండా మండేలాపై 1956 మార్చిలో మూడవసారి ఆంక్షలు విధించారు. దేశద్రోహం కేసులో శిక్షించటానికి తగిన ఆధారాలు లేకపోవటంతో ఆరు సంవత్సరాల తర్వాత 1961లో కోర్టు కేసును కొట్టివేసింది.

మారువేషంలో... యం కె

పొలాల్లోని వ్యవసాయ చావిళ్ళలో రహస్యంగా ఉంటూ మండేలా మారువేషంలో దేశమంతా పర్యటించాడు. శాఖల ప్రాతిపదికన ఎయన్‌సి పునర్నిర్మాణం చేస్తూ, ప్రజలతో 'మాస్ స్టే ఎట్ హోమ్' కార్యక్రమం జయప్రదం చేయించటానికి కృషి చేశాడు. తమ అదుపులో ఉండేవిధంగా తీవ్రవాద కార్యకలాపాలకు పాల్పడే గ్రూపులను ఏర్పాటుచేయాలని ఆయన భావించాడు. అటువంటి కార్యక్రమాలను వ్యతిరేకించే ఎయన్‌సి నాయకుడు లుథులిని, ఇతర సంస్థలను అందుకు ఒప్పించాడు. క్యూబా విప్లవంలో జులై 26 ఉద్యమంలో కాస్ట్రో చర్యలతో ఉత్తేజం పొంది సిసులు, స్లోవో, మండేలాలు 'ఇంఖోంటో ఉయ్ సిజ్వే' (జాతీయ ఆయుధం యం కె) ను 1961లో ఏర్పాటు చేశారు. సైనిక విభాగానికి నాయకుడైన తర్వాత గెరిల్లా యుద్ధానికి సంబంధించిన ఆలోచనలను చే గువేరా వంటి ఇతర సైనిక నాయకుల సాహిత్యం నుండి నేర్చుకుంటుండేవాడు.



1950వ దశాబ్దం చివరిలో మండేలా రహస్యంగా కమ్యూనిస్టు పార్టీలో సభ్యుడయ్యాడు.

ప్రపంచాన్ని చూసి

ప్రభుత్వ కార్యక్రమాలను ఆటంకపరచటం ద్వారా వత్తిడి పెంచటం కోసం యంకె ప్రజలు తిరుగాడని రాత్రి సమయాలలో సైనిక కేంద్రాలు, విద్యుదుత్పత్తి కేంద్రాలు, టెలిఫోన్ లైన్‌లు, రవాణా కేంద్రాలపై బాంబులు వేయటం కొనసాగించారు. ఇది తక్కువ నష్టం కలిగించే కార్యక్రమం కాబట్టి ఈ మార్గాన్ని ఎంచుకున్నామని మండేలా చెప్పాడు. ఈ మార్గం విఫలమైతే గెరిల్లా పోరాటం తప్పనిసరి అవుతుందని ఆయన చెప్పాడు. 1961లో ఎయన్‌సి నాయకుడు లిథులి నోబెల్ శాంతి బహుమతి పొందటంతో డిసెంబరు 16న 57 బాంబు దాడులు జరపటం ద్వారా యంకె తన ఉనికిని బహిరంగ

పరచింది. 1962లో ఇథియోపియాలోని ఆడిస్ అబాబాలో జరిగిన తూర్పు, మధ్య, దక్షిణ ఆఫ్రికా దేశాల స్వాతంత్ర ఉద్యమ సమావేశానికి మండేలాను ప్రతినిధిగా పంపాలని ఎయన్‌సి నిర్ణయించింది. సమావేశానికి వెళుతూ మార్గమధ్యలో టాంజానియా అధ్యక్షుడు జూలియస్ నైరేరేని కలిశాడు. సమావేశానంతరం ఈజిప్టు వెళ్ళి నాజర్ సంస్కరణలను చూసి ఉత్తేజం పొందాడు. ట్యునీసియా, మొరాకో, లైబీరియా, గినియా, మాలి, సియెర్రా లియోన్ తదితర దేశాలు పర్యటించి, పోరాటానికి నిధులు సమీకరించాడు. బ్రిటన్ వెళ్ళి జాత్యహంకార వ్యతిరేక రాజకీయవేత్తలను, ప్రముఖ రాజకీయ నాయకులను కలిశాడు. తిరుగు ప్రయాణంలో ఇథియోపియా వచ్చి ఆరు మాసాల గెరిల్లా యుద్ధంలో శిక్షణ కోర్సులో చేరి, రెండు మాసాలలోనే ముగించి, దక్షిణాఫ్రికా వెళ్ళాడు.

మేటి ప్రసంగం

1962లో ప్రభుత్వం మండేలాను అరెస్ట్ చేసి, కార్మికులను రెచ్చగొట్టి సమ్మెలు చేయిస్తున్నాడని, అనుమతి లేకుండా దేశం వదిలివెళ్ళాడని ఆరోపణలు మోపింది. మండేలా కమ్యూనిస్టులతో కలిసి వ్యవహరించటంతో అమెరికన్ గూఢచారి సంస్థలు మండేలా సమాచారాన్ని దక్షిణాఫ్రికా పోలీసులకు అందించాయని తర్వాత అమెరికన్ రాయబారి వెల్లడించాడు. జాత్యహంకారాన్ని నైతికంగా తామెందుకు వ్యతిరేకిస్తున్నామో తెలియజేయటానికి ఈ విచారణను ఉపయోగించుకోవాలని మండేలా భావించాడు. కోర్టు మండేలాకు ఐదు సంవత్సరాల జైలుశిక్షను విధించింది. "నేను తెల్లజాతి ఆధిపత్యాన్ని అంగీకరించను. నల్లజాతి ఆధిపత్యాన్ని అంగీకరించను. అందరూ కలిసిమెలిసి సమైక్యంగా జీవించే సమాజాన్ని కోరుకుంటాను. అందుకోసం అవసరమైతే ప్రాణాలైనా ఇస్తాను

ఆఫ్రికన్ సమాజమంటే...

1950లో మండేలా యూత్ లీగ్ అధ్యక్షునిగా ఎన్నికయ్యాడు. 1950 తెల్లజాతి మైనారిటీ పాలనకు వ్యతిరేకంగా, 'ఫ్రీ స్పీచ్' రక్షణ కోసం ఆఫ్రికన్లు, భారతీయులు, కమ్యూనిస్టులతో కలిసి మేడే నాడు సాధారణ సమ్మె జరపాలని జోహన్నెస్‌బర్గ్‌లో సమావేశం జరిగింది. తొలుత మండేలా పలు ఉద్యమాల కోసం వివిధ జాతుల ఐక్యతను బలంగా వ్యతిరేకించేవాడు. కానీ కొన్ని పరిణామాలతో మార్పు వచ్చి జాతి వివక్షకు వ్యతిరేకంగా ఐక్య సంఘటనకు మద్దతిచ్చాడు. మోజెస్ కొటానే లాంటి స్నేహితుల ప్రభావం, జాతీయ విముక్తి ఉద్యమాలకు సోవియట్ యూనియన్ అందిస్తున్న సహాయంతో ప్రభావితమైన మండేలాకు కమ్యూనిజంపై అవిశ్వాసం సడలిపోయింది. కార్ల్‌మార్క్స్, వ్లదిమీర్ లెనిన్, మావో జెడాంగ్‌ల రచనలను చదవటం ప్రారంభించాడు. అంతిమంగా మార్క్సిస్టు తత్వశాస్త్రం అయిన గతితార్కిత భౌతికవాద దృక్పథాన్ని అలవర చుకున్నాడు. కమ్యూనిజంలో చెప్పిన వర్గరహిత సమాజం పట్ల తాను ఆకర్షితుడనయ్యానని, అది జీవితంలో అన్నీ పంచుకుని, వ్యక్తి సమాజంలో భాగంగా ఉండే సాంప్రదాయక ఆఫ్రికన్ సమాజం లాంటిదని ఆయన కమ్యూనిజాన్ని గురించి పేర్కొన్నాడు.

అంటూ మండేలా ఇచ్చిన ఓ గొప్ప ప్రసంగం పోరాటానికి ఆయువునిచ్చింది. క్యాస్ట్రో కోర్టులో చేసిన ప్రసంగం 'చరిత్ర నన్ను నిర్దోషిగా నిరూపిస్తుంది'తో ఉత్తేజం పొందిన మండేలా ఈ విచారణను అదేవిధంగా తమ లక్ష్యాలను ప్రచారం చేసుకోవటానికి వినియోగించుకోవాలని భావించాడు. తన లక్ష్యాలను వివరిస్తూ కోర్టులో మూడు గంటలు ప్రసంగించాడు. ప్రభుత్వ సెన్సార్‌షిప్ ఉన్నప్పటికీ ఈ ప్రసంగం విస్తృతంగా ప్రచురితమైంది. అంతర్జాతీయంగా కూడా ప్రఖ్యాతి పొందింది. మండేలాను విడుదల చేయాలని ప్రపంచవ్యాపితంగా విజ్ఞప్తులు వెల్లువెత్తాయి. ఐక్యరాజ్యసమితి, ప్రపంచశాంతి సమితి మండేలా విడుదలకు విజ్ఞప్తి చేశాయి. కానీ 1964 జూన్ 12న మండేలా మరో ఇద్దరికి యావజ్జీవ కారాగార శిక్ష విధించింది.

ఒంటరి ఖైదీ కోసం ప్రపంచం

మండేలా, ఆయన సహ ఖైదీలను ప్రిటోరియా నుండి రాబిన్ ఐలాండ్ జైలుకు తరలించారు. ఆయన అక్కడ 18 సంవత్సరాలు శిక్షను అనుభవించాడు. అక్కడ ఎనిమిది అడుగుల పొడవు, ఏడు అడుగుల వెడల్పు ఉన్న జైలుగదిలో ఒంటరిగా శిక్షను అనుభవించాడు. అక్కడ సున్నపుక్వారీలలో పనిచేయించారు. క్వారీలలో పనిచేసేటపుడు మండేలా నల్లకళ్ళద్దాలను వాడటాన్ని నిషేధించటంతో ఆయన కంటిచూపు దెబ్బతిన్నది. జైలులో పరిస్థితులు అధ్వాన్నంగా ఉండేవి. తర్వాతకాలంలో కొంత మెరుగయ్యాయి. మండేలాను మొదట డి క్లాసు ఖైదీగా పరిగణించారు. తర్వాత ఎ క్లాసు ఖైదీగా చూశారు. లెసోతోలో గౌరవ డాక్టరేట్‌ను పొందాడు. 1979లో అంతర్జాతీయ

అవగాహనకు గానూ నెహ్రూ అవార్డును పొందాడు. 1980లో మండేలాను విడుదల చేయాలనే డిమాండు ప్రపంచవ్యాపితమైంది. ఐక్యరాజ్యసమితి భద్రతామండలి మండేలాను విడుదల చేయాలని డిమాండ్ చేసింది. మండేలా, వాల్టర్ సిసులు, అండ్రూ మలాంజెని, అహ్మద్ ఖత్రాడా, రేమండ్ మహ్లాబాలను ప్రభుత్వం 1982లో కేప్‌టౌన్‌లోని పోల్స్‌మూర్ జైలుకు తరలించింది. ప్రపంచ వ్యాపితంగా పెరుగుతున్న వత్తిడి, దేశంలోని సంక్షోభ పరిస్థితులతో హింసను రాజకీయ ఆయుధంగా వదులుకున్నట్లు ప్రకటిస్తే మండేలాను విడుదల చేస్తానని 1985లో అధ్యక్షుడు బోథా ప్రకటించాడు. దీనిని మండేలా నిర్ద్వంద్వంగా తిరస్కరించాడు.

ప్రభుత్వ హింస ఆగితేనే...

దేశంలో జాత్యహంకార విధానాలపై నిరసనోద్యమాలు తీవ్రమయ్యాయి. ప్రతిఘటనను అణచివేయటానికి ప్రభుత్వం సైన్యాన్ని రంగంలోకి దించింది. ప్రభుత్వం తన హింసాత్మక కార్యకలాపాలను విడనాడినపుడే ఎయన్‌సి హింసను విడనాడుతుందని చెబుతూ మండేలా ప్రతిపాదనలను తిరస్కరించాడు. మండేలాకు టిబి రావటంతో ఆయనను విక్టర్ వెర్‌స్టర్ జైలుకు తరలించారు. ఆయనకు ఒక గది, వంట మనిషిని ఇచ్చారు. అక్కడ నుండి ఎయన్‌సి నాయకులు, ఆలీవర్ టాంబో తదితరులతో సంబంధాలను కొనసాగించాడు. 1989లో దక్షిణాఫ్రికా అధ్యక్షస్థానం నుండి బోతా తప్పుకోవటంతో డి క్లార్క్ అధ్యక్షుడయాడు. శ్వేతజాతి వివక్ష భరించలేని విధంగా ఉందని భావించిన డి క్లార్క్ తన మంత్రివర్గ సమావేశం జరిపి బేషరతుగా మండేలాను విడుదల చేయాలని నిర్ణయం తీసుకున్నాడు. 1990 ఫిబ్రవరిలో మండేలాను విడుదల చేశారు.

విడుదల ఓ ఉప్పెన

అన్నేళ్ళ తర్వాత జైలు నుంచి విడుదలయ్యాక మండేలా కొన్ని రోజులైనా విశ్రాంతి తీసుకుంటారని అంతా అనుకున్నారు. కానీ ఆఫ్రికా విముక్తి కోసం, నల్లజాతీయుల వివక్షను శాశ్వతంగా నిర్మూలించడం కోసం ప్రపంచమంతా తిరిగి మద్దతు కూడగట్టాడు. ఆఫ్రికాలోని జాంబియా, జింబాబ్వే, నమీబియా, లిబియా, అల్జీరియా దేశాలలో పర్యటించాడు. స్వీడన్‌లో ఆలీవర్ టాంబోను కలుసుకున్నాడు. లండన్‌లో జరిగిన పెద్దసభలో పాల్గొన్నాడు. థాచర్‌ను కలిశాడు. అమెరికాలో జార్జిబుష్ సీనియర్‌ను, క్యూబాలో కాస్ట్రోను కలిశాడు. జపాన్ పర్యటించాడు. ఫ్రాన్స్‌లో అధ్యక్షుడు మిట్టరాండ్‌ను, వాటికన్ సిటీలో పోప్‌జాన్‌పాల్ 2ను కలిశాడు. భారత్ రాష్ట్రపతి వెంకటరామన్, ఇండోనేషియా అధ్యక్షుడు సుహర్తో, మలేషియా ప్రధాని మహతీర్ మహమ్మద్, ఆస్ట్రేలియా అధ్యక్షుడు బాబ్‌హాక్‌లను కలుసుకొని దక్షిణాఫ్రికా ప్రజల పోరాటానికి మద్దతును సమీకరించాడు. 1991లో జరిగిన ఎయన్‌సి మహాసభలో అధ్యక్షునిగా ఎన్నికయాడు.

అవకాశం ఉన్నా...

1994, ఏప్రిల్ 27న దక్షిణాఫ్రికా ఎన్నికలు జరిగాయి. 63 శాతం ఓట్లను పొంది ఎయన్‌సి విజయం సాధించింది. తొమ్మిది ప్రాంతాలకుగానూ ఏడు ప్రాంతాలలో ఎయన్‌సి విజయం సాధించింది. మే 10వ తేదీన మండేలాను అధ్యక్షునిగా ఎన్నుకున్నది. 1996లో దక్షిణాఫ్రికా నూతన రాజ్యాంగాన్ని ఆమోదించారు. రెండవసారి అధ్యక్షునిగా ఎన్నికవటానికి అవకాశం ఉన్నా 1999 ఎన్నికలలో ఆయన పోటీచేయలేదు. తాను ఏర్పాటు చేసిన నెల్సన్ మండేలా ఛారిటబుల్ ట్రస్టు కార్యకలాపాలలో ఎక్కువగా భాగస్వామి అయ్యాడు. గ్రామీణాభివృద్ధి, పాఠశాలల నిర్మాణం, ఎయిడ్స్‌పై పోరాటం తదితరాలలో పాల్గొన్నాడు. ఆరోగ్యం దెబ్బతినటంతో 2004లో ప్రజా జీవితం నుండి దూరంగా ఉంటానని ప్రకటించాడు. ఊపిరితిత్తుల అనారోగ్యం సమస్య ఆయనను బాధిస్తూవచ్చింది. ఆ వ్యాధికి చికిత్స పొందుతూ 2013 డిసెంబరు 5న మండేలా 95 సంవత్సరాల వయసులో మరణించాడు. ప్రభుత్వం 10 రోజులు సంతాప దినాలుగా ప్రకటించింది. సంతాప కార్యక్రమాలలో 90 దేశాల నుండి ప్రతినిధులు పాల్గొన్నారు. ఆయన చనిపోయి నాలుగేళ్లే అవుతుంది. మరో నాలుగు శతాబ్దాలకు కూడా ఆఫ్రికన్లే కాదు, యావత్ మానవజాతి ఈ నల్ల జాతి సూరీడిని గుర్తుపెట్టుకుంటుంది. అప్పటికీ ఏదో ఒక వివక్ష ఉంటే దానిపై ఏకతాటిపైకి వచ్చి పోరాడుతుంది. అచ్చు మండేలా పిడికిలి బిగించి చేయెత్తినట్టుగా. ఆయన పిడికిలి ఆఫ్రికా ఖండాన్ని తలపిస్తుంది. ఆయన నినాదం ప్రపంచాన్ని కదిలిస్తుంది.

గొడుగు గోయిందా...

మనం రకరకాల వస్తువుల్ని అద్దెకు ఇస్తుంటారని విన్నాం. కానీ చైనాలో మనం అస్సలు ఊహించని వస్తువులు కూడా రోజు అద్దెకు ఇస్తుంటారు. సైకిళ్ల నుంచి మొదలెడితే ఆ లిస్ట్ చాంతాడంత తెరుచుకుంటుంది. ఇలాంటి యాపారమేదో బాగుందే అనుకుంటూ జావో షుపింగ్ అనే వ్యాపారి గొడుగుల్ని కూడా షేరింగ్‌కు తెరవడం మొదలెట్టాడు. అది చిన్నా చితకాగా కాదు ఏకంగా కోట్లాది గొడుగుల్ని ప్రధాన నగరాల్లో అందుబాటులోకి తెచ్చి. బస్‌స్టాప్‌లు, పార్కింగ్ ప్లేస్‌లు ఇలా ఒకటేమిటి గొడుగు తగిలించడానికి అవకాశమున్న ప్రతి చోట తమ కంపెనీ 'షేర్ ఈ అంబ్రెల్లా' ఛత్రం చేతుల్లోకి చేరేది. ఏప్రిల్ నెలలో సమయం చూసుకుని షాంఘై, నాన్జింగ్, గువాన్జౌ వంటి 11 ప్రధాన నగరాల్లో వీరి సేవలు అద్దెకిచ్చారు. కానీ జూన్ నాటికల్లా వీరి లాభాల గొడుగు ఎగిరిపోయింది. ఎందుకంటే తీసుకున్న వాళ్లు చాలామంది గొడుగుల్ని తిరిగి స్టేషన్లలో అప్పజెప్పాల్సిన విషయం మర్చిపోవడమో కావాలనే ఉంచేసుకోవడమో కారణం. ఇలా 3 లక్షల గొడుగులు ఆచూకీ లేకుండా పోయాయి. అతి తక్కువ అద్దెతోపాటు డిపాజిట్ సొమ్ము కూడా నామమాత్రంగానే ఉండటంతో టకీటకీమని గొడుగులు అద్దెకెళ్లిపోయాయి. కానీ తిరిగి రాలేదు. అయినా సరే తన సేవలు ఆపే విషయంలో వెనుకడుగు వేయనని అంటున్నాడు జావో. ఇంకాస్త జాగ్రత్తలతో మరో 3 కోట్ల గొడుగుల్ని అద్దెకు విప్పేస్తానని అంటున్నాడు. ఇలాగే ఓ సైకిల్ అద్దెకిచ్చే కంపెనీ కొంప కొల్లేరైపోయింది. ఏకంగా 90 శాతం సైకిళ్లు ఏమైపోయాయో తెలీకుండా పోవడంతో దుకాణం సర్దుకున్నారట.

ఇక పళ్లు తోమరు...!

పొద్దునే ఏంటీ బాధ అని అయిష్టంగా బ్రష్ నోట్లో పెట్టుకుని రుద్దే వారికో శుభవార్త. మీరు మీ చేత్తో ఇక పళ్లు తోముకోవడం అనే విషయం కనిపించదేమో మార్కెట్‌లోకి రాబోతున్న అమాబ్రష్ తీరు చూస్తే. అలాగే కేవలం 10 క్షణాల్లో ఆ తతంగాన్ని పూర్తి చేసేసి ఫ్రెష్‌గా నోటిని హ...హ్హా అనిపిస్తుందట అది. చూడ్డానికి తాతలు పెట్టుకునే పళ్ల సెట్‌లా కనిపించే దీన్ని బయోటెక్ ఇంజినీర్లు అభివృద్ధి చేశారు. దీనిలోని మెత్తని బ్రిసిల్స్‌లోకి పేస్ట్ వచ్చేలా ఏర్పాటు ఉంటుంది. అలాగే బ్రిసిల్స్‌ను కదిల్చేందుకు ఓ మోటారు ఉంటుంది. నోటి బయటకు ఉండే బటన్‌ను నొక్కడం ద్వారా అది పనిచేస్తుంది. అదొక్కటే చేత్తో చేయాల్సిన పని. మిగతాదంతా అమాబ్రష్ చూసుకుంటుంది. దీన్ని యాంటీ బ్యాక్టీరియల్ సిలికోన్ పదార్థంతో చేశారని 99.9 శాతం క్రిములు చనిపోతాయని కంపెనీ చెబుతోంది. ప్రతి 3-6 నెలలకోసారి మౌత్ పీస్‌ను మార్చుకుంటే చాలట. మొత్తం 2000 మంది దవడలను పరిశీలించి అందరికీ సెట్ అయ్యేలా ఈ పళ్ల సెట్‌ను తయారుచేశారు. ఒక్కో వైర్‌లెస్ చార్జింగ్‌కు రెండు వారాల పాటు పని చేస్తుంది. ఈ ఏడాది చివరి నాటికి మార్కెట్‌లోకి విడుదల చేయాలని కంపెనీ చూస్తోంది. క్రౌడ్ ఫండింగ్ ద్వారా 36 లక్షలు అడిగితే ఒకే గంటలో డబ్బు సర్దుబాటు అవ్వడమే కాక ఆ తర్వాత ఏకంగా 7 కోట్ల రూపాయలు పోగయ్యాయి. జనాలు పళ్లు తోముకునే విషయంపై ఎంత గుర్రుగా ఉన్నారో నిధులు పోగైన తీరు ద్వారా తెలుస్తోంది. అయితే అందరికీ ఒక డౌట్ ఎంత అడ్వాన్స్‌డ్ అయినా మరీ పది క్షణాల్లో శుభ్రంగా తోమేస్తుందా అని. నిజానికి మొత్తం మీరు 2 నిమిషాల పాటు ఇప్పటిలా బ్రష్ చేస్తే ఒక్కో పంటికి ఒకటి రెండు క్షణాలే కేటాయిస్తున్నట్టు... కానీ ఒకేసారి అమాబ్రష్‌తో పది క్షణాల పాటు కడిగేస్తున్నట్టే కదా అని లాజిక్ మాటాడుతున్నారహే.



వింత లోకం

1,2,3 స్టాట్యూ...!

చిన్నప్పుడు మనమో ఆట ఆడుకునే వాళ్లం గుర్తుందా! 'స్టాట్యూ' అని అనగానే ఎలా ఉన్నోళ్లం అలా విగ్రహంలా బిగుసుకుని కనీసం రెప్ప కూడా ఆర్పకుండా ఉండిపోవాలి. ఎవరు ఎక్కువ సేపు అలా ఉండగలుగుతారో వాళ్లే విజేతలు. మనల్ని టచ్ చేయకుండా మనల్ని కదిలించే ప్రయత్నాలు చేయడం.. కొందరు నవ్వు ఆపుకోలేక... కొందరు భయపడి ఓడిపోవడం ఈ ఆటలో కామన్. ఈ ఆటకు మాత్రం అబ్దుల్ అజీజ్ అనే పెద్దాయన్ని అస్సలు పిలవమాకండే. ఎందుకంటే అతణ్ని కదిలించడానికి మీకు గంటలు పడతాయి. మరీ చాలెంజ్ చేసేస్తే రోజులు కూడా దొర్లుతాయి. ఇంత గట్టిగా శిలలా నిలబడిపోవడం

మనోడికి 32 ఏళ్ల నుంచి అలవాటు. అలా అనేకంటే అందులో ప్రొఫెషనల్ కూడా. 'ఇండియా స్టాట్యూ మ్యాన్'గా విదేశీ పర్యాటకుల బిరుదు కూడా పొందిన అబ్దుల్ రాజు గారి వేషంలో చెన్నై వీజీపీ రిసార్ట్ ఎదురుగా నిల్చుంటాడు. 1985లో అక్కడ సెక్యూరిటీ గార్డుగా చేరిన అబ్దుల్ ఆ తర్వాత అక్కడే ఇలా స్టాట్యూ మ్యాన్‌గా మారాడు. రిసార్ట్ యజమాని ఓసారి యూకేలోని బకింగ్‌హామ్ ప్యాలెస్‌ను సందర్శించినపుడు అక్కడ రాయల్ గార్డ్స్ ఆశ్చర్యపరిచారు. వాళ్లు కదలకుండా అలాగే నిలబడి బొమ్మల్లా అనిపిస్తారు. అదే ఐడియా తన రిసార్ట్‌లోను నిలబెట్టేస్తే బోలెడు ప్రచారం లభిస్తుందని ఆయన ఆశపడ్డాడు. అలా ఇండియా రాగానే అబ్దుల్‌తోపాటు మరో నలుగురికి ఇలా శిక్షణ ఇప్పించాడు కానీ అబ్దుల్‌లా అన్నేసి గంటలపాటు కదలకుండా ఉండలేకపోయారు. ఉద్యోగం పోగొట్టుకోకూడదని ఎంత కష్టమైనా, ఇబ్బంది పడినా ఇలా మూడు దశాబ్దాలుగా రోజుకు ఆరు గంటలు శిలా విగ్రహం అవతారమెత్తుతాడు. ఈ విషయంలో ఎంతో పేరున్న రాయల్ గార్డ్స్ ప్రతి రెండు గంటలకోసారి షిఫ్ట్‌లు మారుతుంటారు. కానీ అబ్దుల్ మాత్రం ఆరు గంటల పాటు...! లేకుంటే ఇళ్లు వెళ్లదీయలేడు కదా. వారికేమో ప్రత్యేక విన్యాసం... మనోడికేమో ఆకలి అత్యవసరం.



- భూమి నుండి 20,000 అడుగుల ఎత్తులో ఏర్పడే మబ్బులు మంచు స్ఫటికాలతో ఏర్పడతాయి.
- ఆకాశంలో అలల రూపంలో కనిపించే మేఘాలకి 'ఆరిస్' అనే పేరుంది. తుఫానుల సమయంలో బలంగా వీచే చల్లగాలుల ద్వారా ఇవి ఏర్పడతాయి.
- నింగిలో వేల మైళ్ళ పొడవున విస్తరించి వుండే మేఘాలని సిర్రో స్ట్రాటస్ అని పిలుస్తారు.
- ఇరాన్‌లో మేఘాలపై ఓ సామెత కూడా ఉంది. 'నీ మబ్బులు ఎప్పుడూ రంగులతో నిండి ఉంటాయ'నే అర్థం వచ్చే ఆ సామెత పిల్లల్లో ఆశావహ దృక్పథాన్ని కలిగించేందుకు ఎక్కువగా ఉపయోగిస్తారు.

- భూగ్రహంపైనే కాదు శుక్ర, శని, గురు గ్రహాలూ మేఘాలని కలిగుంటాయి. అయితే వీటిలో సల్ఫ్యూరిక్ ఆమ్లం, అమ్మోనియా శాతం కాస్త ఎక్కువ. అంటే అవి ఆమ్ల వర్షం కురిపిస్తాయన్న మాట.
- భూమి నుండి పద్నాలుగు మైళ్ళ ఎత్తున వుండే దట్టమైన భారీ మేఘాలని కుములోనింబస్ అని పిలుస్తారు. వడగాల్పులు, వరదల సమయంలో మరింతగా బలపడే ఈ మేఘాల ద్వారానే ఎక్కువ విమాన ప్రమాదాలు జరుగుతుంటాయి. అందుకే వీటిని పైలెట్‌లకి అత్యంత ప్రమాదకరంగా పరిగణిస్తారు.

మేఘ సందేశం

- సూర్యుడి నుండి ప్రసరించే కాంతి తెలుపు రంగులోనే వుంటుంది. శూన్యంలో వుండే వివిధ కణాల ద్వారా కాంతి ప్రసరించిడం వల్ల మనకి ఆకాశం నీలి రంగులో కనిపిస్తుంది. అయితే మేఘాల్లోని నీటి బిందువులపై సూర్య కాంతి ప్రసరించినప్పుడు ఎలాంటి పరివర్తనం వుండదు కాబట్టి మేఘాలు ఎక్కువగా తెల్లని రంగులోనే కనిపిస్తాయి.
- మబ్బుల్లో వుండే ఒక్కో నీటి బిందువు 0.02 మి.మీ. వ్యాసాన్ని కలిగుంటుంది.
- నీటి ఆవిరి ద్వారా ఏర్పడే మబ్బులు భూమికి అతి సమీపంలో ఏర్పడినవే.



- నోక్టిలూసెంట్ మేఘాలు భూమి నుండి నలభై మైళ్ళ ఎత్తులో ఏర్పడతాయి. అయితే ఇవి ఎక్కువ ప్రకాశవంతంగా కనిపించేది రాత్రిపూట మాత్రమే. ఆకాశంలో నక్షత్రాలు కనిపించినప్పుడు మాత్రమే కనిపించే ఈ మేఘాలని రాత్రి మేఘాలనే (నైట్ క్లౌడ్స్) అనే పేరు కూడా వుంది.
- పల్చటి పొరలా ఒక నిర్దిష్టమైన రూపం లేని మేఘాలు స్ట్రాటస్ అని పిలుస్తారు.
- మేఘాలు సహజసిద్ధంగానే కాదు విమానాలు, జెట్ ప్లెయిన్ల ద్వారా వెలువడే వేడి, వాతావరణంలోని తేమతో కలిసి కొన్ని మేఘాలు ఏర్పడతాయి. వాటిని కాంట్రెయిల్స్ అంటారు.
  ఇవి కనిపించేది మాత్రం అతి తక్కువ సమయమే.

- ఆకాశం వైపు తలెత్తగానే మైళ్ళ దూరం ప్రకాశవంతంగా అలా ఓ గొడుగు పట్టినట్టు కనపించే మేఘాలని ఎన్విల్ అంటారు. ట్రోపోస్పియర్, స్ట్రాటోస్పియర్‌ల మధ్య చల్లని గాలులు బలంగా ఢీకొట్టినప్పుడు మెరుపులతో ఏర్పడే మేఘాలే ఇవి.
- క్లౌడ్ సీడింగ్ అనేది దట్టమైన మేఘాల్లో సిల్వర్ అయోడైడ్/గడ్డకట్టిన మంచుని చొప్పించడం ద్వారా వర్షాన్ని తెప్పించే కృత్రిమ పద్ధతి.

తెలుగు సినిమాని అంకితభావంతో ఆరాధించి, అద్భుతమైన సినిమాలు తీసి.. ఆ ఖ్యాతిని దశదిశలా వ్యాపింపచేసినవారు నాగిరెడ్డి, చక్రపాణి గార్లు. ఆ కోవకి చెందిన వారే మొట్టమొదటి తెలుగు దాదాఫాల్కే అవార్డు గ్రహీత యల్వీ ప్రసాద్. యల్వీ ప్రసాద్ సినిమా ప్రేమికుడు.... సినిమానే జీవితంగా భావించిన వ్యక్తి. చివరికి తన జీవితాన్నే సినిమాకి అంకితం చేసిన వ్యక్తి. ఇక ఈ ముగ్గురి కలయికలో 1955లో వచ్చిన సినిమా 'మిసమ్మ'.

ఆనాటి చిత్రం

మిస్సమ్మ

ఈ సినిమాలో నటీనటుల నటన, సంగీతం సాహిత్యం, దర్శకత్వపు ప్రతిభ ఒక దానితో ఒకటి పోటీ పడ్డాయి. సినిమా మొదలయ్యింది మొదలు చివరి ఫ్రేమ్ వరకు ఎక్కడా విసుగనిపించకుండా... నవ్వులనావలా సాగిపోతుంది. అదీ ఈ చిత్రం ప్రత్యేకత.

కథ ఎలా పుట్టింది

ఆ రోజుల్లో నిర్మాతా దర్శకులు స్టార్స్ కోసం ఎదురుచూడకుండా మంచి కథ కోసం ఎదురు చూసేవాళ్ళు. ఆ కథ ఏ భాషలో వున్నా వెదికి పట్టకొనేవారు. అప్పట్లో మన తెలుగు నిర్మాత, దర్శకుల దృష్టి బెంగాలీ రచనల మీద వుండేది. బెంగాలీ రచనలు మన తెలుగు ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అయ్యేవి కూడా. యెతీష్ బెనర్జీ అనే బెంగాలీ రచయిత 'మన్యోయీ గర్ల్స్ స్కూల్' హాస్య రచనని చక్రపాణిగారు చదవడం జరిగింది. కొత్తగా అనిపించింది. వైవిధ్య భరితమైన సినిమా అనిపిం చింది. వెంటనే ఆస్థాన పండితులు పింగళివారిని పిలిపించారు. కథ మీద కూర్చున్నారు. అద్భుతంగా వస్తోందని ఎంజాయ్ చేస్తున్నారు. కాని నాగిరెడ్డి గారికి అంతుచిక్కడం లేదు. ఆ రోజుల్లో పెళ్ళికాని ఇద్దరు యువతీ యువకులు భార్యా భర్తలుగా నటించడమంటే.... జనం ఒప్పుకుంటారా? సన్నివేశాలు లాజిక్‌కి నిలుస్తాయా? ఎన్నో అనుమానాలు.. అయితే నాగిరెడ్డిగారికున్న నమ్మకం ఒకటే. కథ మీద కథనం మీద మంచి పట్టున్న వ్యక్తి సినిమాని సెల్యులాయిడ్ మీద మలచడంలో మంచి నేర్పరి. అటుపైన పింగళివారి రచన... రాజేశ్వరరావు గారి పాటలూ చిత్రానికి ప్రాణం పోస్తాయి. అంతే పచ్చజెండా వూపి సినిమా మొదలు పెట్టేశారు.

తారాతోరణం

ఈ చిత్రంలో అగ్రనటులు యన్ టి రామారావు, అక్కినేని నటించడం ఆ రోజుల్లో గొప్ప సంచలనం! భానుమతి, జమున, రేలంగి, రమణారెడ్డి , అల్లురామలింగయ్య, బాలకృష్ణ, రుష్యేంద్రమణి దొరైస్వామిలు నటీనటుల. షూటింగు మొదలయ్యింది. ఇందులో భానుమతి 'మిసమ్మ'. కొన్ని సన్నివేశాలు చిత్రీకరణ కూడా జరిగింది. విజయవారి షూటింగు ఉదయం 7గంటలకే మొదలయిపోయేది. ఇంటి నుండి సాంప్రదాయకంగా బయలుదేరడం... మేకప్ చేసుకున్న తర్వాత మేరీ పాత్రలో...బొట్టు

లేకుండా కనిపించడం... తెల్లచీర కట్టుకోవడం...ఆ పాత్రకి అవసరమైన సంభాషణలు పలకడం ఇవ్వన్నీ భానుమతికి ఇబ్బందిగా అనిపించాయి. తనలో నటిని సాంప్రదాయ బంధాలు డామినేట్ చేశాయి. ఇక సినిమా చేయనని చెప్పకనే చెప్పింది. ఇలా జరుగుతుందని ముందే వూహించిన యల్వీప్రసాద్ వెంటనే సావిత్రిని పిలిపించారు.

టైటిల్‌రోల్..అది కూడా ఇద్దరు అగ్రనటులు వున్నారు...పెద్దబరువు మోయగలదా? అనుమానం కలిగింది. నాగిరెడ్డి గారికి భరోసా ఇచ్చారు యల్వీ ప్రసాద్.

మిస్సమ్మగా సావిత్రి విశ్వరూపం

సావిత్రి మిస్సమ్మ పాత్రలో ఒదిగిపోయింది. కట్టూబొట్టూ... మాటతీరు.. అన్నీ పాత్రకి పరిపుష్టిని చేకూర్చాయి. దీని కోసం మెరీనాబీచ్‌లో వున్న శాంతోమ్ చర్చికి వెళ్ళి ఎంతో హోమ్‌వర్క్ చేసింది. సెట్‌లో నటిస్తున్నప్పుడు యల్వీప్రసాద్ గారు పరవశించిపోతుండేవారు. ఆయన అలవాటు అది. ఎవరైన పాత్రని అద్భుతంగా చేస్తుంటే ఆనందంతో ఎగ్జయిటయ్యేవారు. ఆ వయసులో యన్‌టిఆర్‌తో, యస్వీఆర్‌తో పోటీపడి నటించింది. సావిత్రి కాంబినేషన్ సీన్సులో నటించేపుడు రామారావు... 'సావిత్రిగారూ మీరు రిహార్సల్స్‌లో ఇలా నటిస్తున్నారు. టేక్‌లో ఎలానటిస్తారో చెప్పండి అది ఫాలో అవుతాను అనేవారు. సావిత్రికి యస్వీరంగారావుకి ఓ అలవాటుంది. సహకార దర్శకుడు సంభాషణలు చదువుతూవుంటే ఒక సారి వింటారు. అంతే అది గుర్తు పెట్టుకొని రిహార్సల్స్ చేస్తారు. కానీ టేక్‌లో వాళ్ళకేమనిపిస్తే! అంటే పాత్ర ఎలా బిహేవ్ చెయ్యాలని అనిపిస్తే అది చేస్తారు. ఫస్ట్ టేక్‌లోనే సావిత్రి ఎంత పెద్దషాట్‌నైనా అద్భుతంగా చేస్తుంది. అదే టేక్ టు అంటే పసిపిల్లలా బుంగమూతి పెడుతుంది. తను బాగా చేస్తే మిగతా కాంబినేషన్‌లో వున్న వాళ్ళంతా చెయ్యాలిగా... 'మిస్సమ్మ' చిత్రం షూటింగ్‌లో తరచూ చిటపటలు వినిపించేవి. ఈ సినిమాలో నటిస్తుండగానే సావిత్రి నటన చూసి "ఓ సినీ అసాధ్యం...నువ్వు... నువ్వేం చేస్తావో మాకు అంచనాలకు అందకుండా పోతోంది... నువ్వు మామూలు నటివి కావు మహానటివి తల్లోయ్.... అంటూ మురిపెంగా అనేవారు. ఆయన సావిత్రికి పితృసమానులు ఆయన ఆశీస్సులు ఫలించాయి. తెలుగు సినిమా చరిత్రలో మహానటిగా నిలిచిపోయింది సావిత్రి.

కన్‌ఫ్యూజన్‌లో వెరైటీ

మిస్సమ్మ కథ స్థూలంగా చెప్తే గందరగోళంగా వుంటుంది. చూస్తే కన్నులపండువగా వుంటుంది. చక్రపాణిగారు మేజిక్ చేశారు. ప్రేక్షకుల్ని మంత్రముగ్ధుల్ని చేశారు. ఈ సినిమాను చందమామ కథలా మలిచారు. అందుకే ఈ సినిమా ప్రకటన ఇస్తూ పెద్దలు తప్పకుండా చూడవలసిన... పిల్లల సినిమా అన్నారు. ఒక పెళ్ళైన అమ్మాయి పరాయి మగాడికి భార్యగా నటించడానికి ఒక లాజిక్ కావాలి. అలాగే యన్టీఆర్‌కీ అదే పరిస్థితి ఇద్దరూ గడుసువాళ్ళు. నాయుడు (యస్వీ రంగారావు) ఇంట్లో చేరతారు. నాయుడుగారి మేనల్లుడు రాజు(ఎఎన్ఆర్) డిటెక్టివ్‌పిచ్చి. బడిలో పిల్లల్ని వదిలేసి బర్రెను వెతుకుతూ వుంటాడు. అప్పటికి ఎన్నో సినిమాల్లో హీరోగా చేసి కామెడీపాత్ర చెయ్యడానికి అక్కినేని సిద్ధపడటం సాహసమే. అది విజయాసంస్థ మీద యల్వీప్రసాద్ మీద గౌరవంతో చేసినపని. స్కూలుని తీర్చిదిద్దడానికి వచ్చిన యన్టీఆర్, సావిత్రిలలో సావిత్రి(మేరీ) నాయుడుగారి తప్పిపోయిన పెద్దకూతురు మహాలక్ష్మి అని రాజు (అక్కినేని)కి అనుమానం. ఈ దిశగా పరిశోధన సాగుతుంది. అంటే కథ ముందే తెలుస్తుంది. కుటుంబంలో తండ్రి, తల్లి, పెద్దకూతురు, చిన్నకూతురు (జమున), మేనల్లుడు (అక్కినేని) అంతా ఒక్క చోటే వుంటారు. మేరీ అంటే సావిత్రి యన్టీఆర్‌ల మధ్య నడిచిన ప్రతి సన్నివేశం రక్తికడుతుంది. అలాగే జమున, అక్కినేని మధ్య సాగిన అల్లరి సన్నివేశాలు కూడా అలరిస్తాయి. మధ్యలో రేలంగి, రమణారెడ్డిల హాస్య సన్నివేశాలు...సందర్భోచితంగా ప్రవర్తించడం దర్శకుని మేధస్సుకి తార్కాణం. ఇందులో రమణారెడ్డి, సావిత్రిని ప్రేమించడం ఓ పార్టు. రేలంగి, యన్టీఆర్‌ల మధ్య సన్నివేశాలు గడుసుదనం నిండివుంటుంది. సినిమా ఒక్కమాటలో చెప్పాలంటే పెళ్ళివారిల్లులా కళకళలాడుతూ వుంటుంది. చిత్రం ఏమిటంటే మిస్సమ్మ చిత్రాన్ని ఇప్పుడు చూసినా కొత్తగానే వుంటుంది. ఎవరి పాత్ర ఎంతన్నది ప్రధానం కాదు. ఎవరు ఎంతసేపు కనిపించినా పాత్రని పండించారు. సినిమాని పదిపదుల కాలాలు బతికించారు. 'మిస్సమ్మ' సినిమాలో పాటలకు స్వరాలు అందించిన సాలూరి రాజేశ్వరావు గారి స్వరాలన్నీ ఆ పాత మధురాలు. 'కరుణించు మేరి మాత' పాట పి.లీల పాడారు. 'రావోయిచందమామా మా వింత గాధవినుమా....' ఎఎంరాజా, లీల పాడారు. ఆ పాటలు ఇప్పటికీ నిత్యనూతనంగా వుంటాయి. ఆ రోజుల్లో ఘంటసాల మాస్టారు గొంతు వినిపించని మొదటి సినిమా ఇదేనేమో!

- ఇమంది రామారావు

9010133844

అక్కినేనికి అభినందనలు

ఇక్కడ ప్రత్యేకించి చెప్పుకోవలసింది అక్కినేని గురించి. అప్పటికి ఆయన పాపులర్ హీరో. గొప్ప ఇమేజ్ వున్న హీరో 'బర్రె' తప్పిపోయిందని... ఆ బర్రెని వెతికే డిటెక్టివ్‌గా హాస్యాన్ని పండించడానికి మీసాలు తీసేసి టోపి పెట్టి తన హీరోయిజాన్ని సైతం వదులుకున్నాడు. ముఖ్యంగా సావిత్రి దగ్గర పాట నేర్చుకుంటున్న సన్నివేశంలో 'నాకు నేను నీకు నీవే' అని పదేపదే మార్చిమార్చి అపశృతిలో పాడటం థియేటర్లలో నవ్వులపూలు పూయించారు. తన హీరో ఇమేజ్‌కి కొంత డ్యామేజీ అయిందని చెప్పకతప్పదు. ఈ విషయం ఎందుకు చెప్పవలసి వచ్చిందంటే ఎంతపెద్ద హీరో అయినా ఒకపాత్రని ఒప్పుకున్న తర్వాత ఆ మేరకు ఎలాంటి పాత్రలో అయినా నటించాలి అని ఆ రోజుల్లోనే నిరూపించాడు అక్కినేని!

అనూహ్యమైన విజయం!

సినిమా బాగా వస్తుందనుకున్నారు గానీ ఇంత గొప్పగా వుంటుందని నాగిరెడ్డిగారు ముందుగా ఊహించలేదు. మిస్సమ్మ సినిమాతో యన్టీఆర్‌కి మహిళా ప్రేక్షకుల ఆదరణ పెరిగింది. సావిత్రిని కొంతమంది క్రిస్టియన్ సంస్థలవారు ఆ రోజుల్లో బ్రాండ్ అంబాసిడర్‌గా తీసుకున్నారు. చాలా క్రిస్టియన్ సంస్థలు సావిత్రిని ఆహ్వానించి సంబరాలు చేసుకొనేవారు. 'మిస్సమ్మ' సంచలన విజయోత్సవాలు ప్రతిచోట జరిగాయి. విజయా గార్డెన్స్‌లో జరిగిన అభినందన సభలో నాగిరెడ్డి చక్రపాణిగార్లు.. యూనిట్‌లో పనిచేసిన చిన్నాపెద్దా అందరికీ ఘనమైన విందునిచ్చి సముచితరీతిలో సత్కరించారని గొప్పగా చెప్పుకొనేవారు. ఒక మంచి కథని నమ్మి అంకితభావంతో పని చేసి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే విజయం తప్పక వరిస్తుంది. ఇది సత్యం!! ఇది అందరూ తెలుసుకోవాల్సిన సత్యం.

కవిత్వం

అరచేతులు అడ్డుపెట్టి

నల్లజాబితా చిరునామాల్లో అతడు
నన్ను జేర్చి
నా కలంపై నిషేధం అన్నాడు
నిండిన జలాశయంలోంచి నీరులా
గుండె నిండిన అక్షరాలు పొర్లుతున్నాయి
ధమనులు సిరలు నిండుగా పారుతున్నాయి
విరామం కోరని మనోయంత్రం
భూ ప్రదక్షిణ చేస్తూవుంది
రచనలు హద్దులు దాటి సరిహద్దులు దాటి
దారుల్లో రహదారుల్లో
మేడల్లో గుడిసెల్లో
ఆహారమై జీర్ణమై
వంచిన తల ఎత్తమంటున్నాయి
నీ అస్త్రం నిశ్శబ్దంగా నడిచి వచ్చి
తలవాల్చి నా ముందు నిల్చింది!
పంజరంలో చిలకను
స్వేచ్ఛకు ఉపమానం చేసి
నా నోటికి తాళం వేసి అతడు
నన్ను బందీ అన్నాడు
నా చూపులు పరిభ్రమిస్తున్నాయి
కాళ్ళు దారుల్ని వెదుకుతున్నాయి
స్వేచ్ఛ వాయువై వీస్తుంటే
అరచేతులు అడ్డుపెట్టి
అడ్డుకుంటూ ఎత్తుగడలు
చేతలు ప్రతి ఘటనలై
చుట్టు ముట్టాక
ఒంటరిగా ఓటమితో స్వేచ్ఛముందు
తెల్లజెండా వూపుతూ అతడు
సంస్కృతో సంప్రదాయమో
వారసత్వమో అభిరుచో అలవాటో
ఆరుగాలం కష్టించి
ఒకానొక ఆహారం కంచం చేరితే
చేతికి నోటికి మధ్యన నిల్చి అతడు
ఆహారం నిషిద్ధమన్నాడు
కంచం ఢమరుకమై మోగితే
చెవిటి వాళ్ళు శ్రవణమున్నవాళ్ళు
నా వెంట నడిస్తే
ఇదిగో నీ ఆహారం నీ కేనంటూ అతడు
రహదార్లు అందరినీ
నడిచే నడకలు వేరు
ప్రాణ వాయువు అందరినీ
పీల్చే నాసికలు వేరు!

అడిగోపుల వెంకటరత్నమ్
సెల్ : 9848252946

గాజుల సవ్వడి

ఎన్ని నిర్బంధ నిశిరాత్రులు...
మత్తు దుర్గంధాన్ని
మౌనంగా భరించాయీ... మట్టిగాజులు
మగని 'ఆకలి'ని ఎదిరించే చేవలేక
బెదిరే బేలచూపులు
నేల అంచుల్లో దిగబడి
భళ్ళున బద్దలైన
మనసు అద్దం ముక్కలు
ఆకలి ఎసట్లో సలసలా కాగే
అతివ మనోస్థైర్యం
నిప్పుకణికల పై నీళ్ళు జల్లే
పసివాళ్ళ ఆక్రందన
గాజులని ఆడతనానికే
పరిమితం చేసిన మగోడు
మద్యం మహమ్మారీతో
ఛిద్రమయ్యే బతుకు గోడు
రోషాన్ని పురికొల్పుతూ
ఇంటికో దూబగుంట రోశమ్మ
గొలుసుదుకాణాల సంకెళ్ళని
సవాలు చేస్తూ గాజులసవ్వడి
బంగరుగాజుల నడుమ నర్మగర్భంగా
మందహాసిస్తోన్న మట్టిగాజులూ...
మధువును నిరసిస్తూ
చేతల చేతులు కలపాల్సిన ఘడియలివి...!

ఇల్ల ప్రసన్నలక్ష్మి
9494165632

అందం



కాలేజీ ఆడిటోరియంలో సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతున్నాయి. 'నవీన' అనే ఫ్యాషన్ కాంపిటీషన్‌లో చివరి రౌండ్ ఒకటే ఉత్కంఠ. కిరీటం ఎవరికి దక్కుతుందో నిర్ణయించే రౌండ్ అది. జడ్జెస్ టాపిక్ ఇచ్చారు. 'మీ అమ్మ కురూపి ఐతే మీ స్పందనేంటి..? నాలుగు మాటల్లో చెప్పండి..!' ఒక్కొక్కరిగా వస్తున్నారు.. 'ఆమెతో అడ్జస్ట్ అవ్వాలని, ఆమె అందంగా ఉండేలా తీర్చుదిద్దుతాం అని, బాగా డబ్బు సంపాదించి ప్లాస్టిక్ సర్జరీలు చేయిస్తామని' ఇలా అందరూ ఆశ్చర్యపోయే సమాధానాలు చెప్తున్నారు. జడ్జెస్ ఆ సమాధానాలకు విసుగు చెందిన సమయంలో సంధ్య వంతొచ్చింది.

కథ

అమూల్య చందు కప్పగంతు
9059824800

"మా అమ్మను అపురూపంగా చూసుకుంటాను. మా అమ్మను అందంగా ఉన్నట్టు ఊహించి అడ్జెస్ట్ కావాల్సిన పనిలేదు. ఆమె వ్యక్తిత్వానికి, ఆమె కురిపించే ప్రేమకు మించిన అందం నాకు కనబడలేదు. ఆమె ఎలా ఉంటే అలానే ఇష్టపడతాను. ప్రేమిస్తాను." అని నవ్వుతూ సమాధానమిచ్చింది. ఒక్కసారిగా చప్పట్లు మారుమోగాయి. 'వండర్‌ఫుల్ ఆన్సర్..' ఒక జడ్జి ఆ సమాధానానికి ముగ్ధులై కళ్లల్లోంచి జారబోయే కన్నీటి చుక్కలను వేలితో అడ్డం పెట్టి అదిమేసి స్టేజ్ ఎక్కారు. 'నవీన... మిస్ సంధ్య' అంటూ కిరీటం పెట్టేసరికి సంధ్యకి చెప్పలేనంత ఆనందంగా కలిగింది. ఎగిరి గంతేసినంత పనిచేసింది.

ఆడిటోరియం బాగా హడావిడిగా ఉంటే దానికి చాలా చివరగా ఒక మూలగా ఒక ముసుగు కప్పుకున్నామె నిలబడి అంతా చూస్తోంది. కళ్లు తుడుచుకుంటూ చప్పట్లు ఆపకుండా కొడుతూనే ఉంది. కూర్చునే సీట్ లేక అక్కడే కింద ఉన్న గట్టు మీద కూర్చోబోయింది. "హే.. యూ! హు ఆర్‌యూ..? ఎవరు నువ్వు...? సెక్యూరిటీ... సెక్యూరిటీ.." అని ఒక లెక్చరర్ అరుస్తూ వస్తోంది. "అమ్మా... అమ్మా...! దయచేసి అరవకండి. నే వెళ్లిపోతా...! క్షమించండి! నేను ఇలా వచ్చినందుకు. సెక్యూరిటీకి తెలియకుండా వచ్చాను. దయంచండమ్మా...!" అంటూ బతిమాలింది. లెక్చరర్ మనస్సు కరిగిపోయింది. "ఎవరు నువ్వు...?" సూటిగా అడిగింది. "ఏం లేదమ్మా... ఊరికే ఇక్కడి పిల్లల్ని చూడ్డానికి వచ్చానమ్మా. అంతే..! వెళ్లిపోతానమ్మా. క్షమించడమ్మా..." అంటూ కంగారుగా వెనుదిరగబోయింది. అంతలో ముసుగు పక్కకు జారిపోయింది. "ఛ.." అని వెంటనే "సారీ" చెప్పుకుంది లెక్చరర్. ముఖమ్మీద చేతులకు చర్మం లేదు. "క్షమించండి. దయచేసి చెప్పండమ్మా. ఎవరు మీరు? ఇక్కడికి ఎందుకు వచ్చారు..? సెక్యూరిటీని దాటుకుని మీరు వచ్చారంటే ఏదో కారణం ఉండి ఉంటుంది. చెప్పండి." అని బతిమాలింది.

కళ్లల్లో నీళ్లు తిరుగుతూనే తానెవరో చెప్పింది "ఆ కిరీటం పెట్టించుకుందే ఆ బంగారు బొమ్మ ఆమె తల్లినమ్మా నేను" అంది. ఒక్కసారి లెక్చరర్ షాక్‌కు గురయ్యింది. "మీరు ఆమె తల్లా....? మరి ఏ కార్యక్రమానికి ఎప్పుడూ కాలేజీకి రాలేదేంటి మీరు." అంది ప్రశ్నార్థకంగా. "రిపోర్ట్స్‌లో మీ పేరు ఉంటుంది. కాని రాలేని పరిస్థితి అంటూ సంతకాలు పెట్టించుకొస్తుందే తప్ప సంధ్య మీ విషయం ఎప్పుడూ చెప్పలేదే...!" అని ప్రశ్నించింది లెక్చరర్. "ఈ అవతారంతో ఇక్కడికొచ్చి తన మనసుని వాళ్ల స్నేహితుల మధ్య గాయపరచలేనమ్మా." అని బదులిచ్చింది ముసుగు మనిషి ఎంతో దు:ఖంతో. "సరే మీరు నాతో రండి." అంటూ తనతో స్టాఫ్ రూమ్‌కి తీసుకెళ్లి కూర్చోబెట్టి మళ్లీ ఆడిటోరియానికి వచ్చింది. సంధ్యను పిలిచి తీసుకెళ్లింది. కూర్చోమని బల్ల చూపించింది. ఏం అర్థం కావట్లేదు అక్కడేం జరుగుతుందో సంధ్యకి. "సంధ్యా..! ఒక్కసారి ఆమెను చూడు. నీకు తెలుసా...?" అంది ఆమె. వెంటనే పక్కనున్నామె ముసుగు తొలగించింది. "అమ్మ...!" పెదాలు పలికాయి కాని శబ్దం బయటికి రాలేదు. "మీ అమ్మగారేనా...?" "ఔను మేడమ్..!" "మరి ఎప్పుడూ కాలేజీకి తీసుకురాలేదే..?" సమాధానమివ్వలేదు సంధ్య. "ఇప్పుడు స్టేజ్ మీద నీకు కిరీటం ఎలా దక్కిందో..? ఏ ప్రశ్నకు నువ్వు సమాధానం ఏం చెప్పావో గుర్తుందా..?" నిలదీసింది లెక్చరర్. తలొంచుకుని 'ఎస్' మేడమ్ అంది. "మరి అక్కడి సమాధానం.. ఇక్కడ మీ అమ్మగారు కనిపించేసరికి అలా లేదే..! నీలో ఆ భావనా లేదే...!" అంది.

సమాధానం ఇవ్వలేకపోయింది. సంధ్య మనసును అర్థం చేసుకుంది. కాసేపటి నిశ్శబ్దం తర్వాత ఎవరిళ్లకు వాళ్లెళ్లారు.

సంధ్య ఇంటికి రావడంతోనే బ్యాగ్‌ని విసిరికొట్టింది వాళ్ల అమ్మ ముఖమ్మీదికి. "ఏం బుద్ధి లేదా నీకు..? కాలేజీకి నాకు తెలీకుండా ఎందుకొచ్చావ్...? ఎవరు రమ్మన్నారు నిన్ను. నీ ముఖం చూస్తేనే కంపరం నాకు. బతికున్న శవంలా ఉంటావ్ నువ్వు. చర్మం ఉండదు. ఆ గాట్లు ఛీ..!" అంటూ అరుస్తోంది పిచ్చిపట్టిన దానిలా. "అమ్మ అంటే ఎలా ఉండాలి? నలుగురిలో మెరిసిపోవాలి. నేను గర్వంగా పరిచయం చేసుకునేలా ఉండాలి. ఫ్యాషన్‌గా ఉండాలి. మరి నువ్వు..! ఏమని పరిచయం చేయాలి.. నిన్ను నా ఫ్రెండ్స్‌కు. అందుకే వాళ్లను ఇంటికి తీసుకురాను. నన్ను ఎగతాళి చేస్తారు. నవ్వుతారు. తెల్సా..!" రెచ్చిపోయి తన ఆవేదనను తిట్ల రూపంలో వెళ్లగక్కుతోంది. ఆ మాటలు భరించలేక ఆ తల్లి ఏడుస్తోంది. తాను ఏడ్చినా ఆ గుర్తులుండవ్ ముఖమ్మీద.. చర్మం ఉండదు కదా. "లేదు తల్లీ..! ఫంక్షన్‌కు రావొద్దన్నావు గుర్తుంది కానీ, నువ్వు అంత రెడీ అయ్యి వెళుతుంటే నా దిష్టే తగిలేట్టు ఉందని.. నువ్వే గెలుస్తావని.. అలా అందరిలో నిన్ను చూడాలని." అన్నది తలదించుకుని. "ఛ..! ఎంత చెప్పినా నీకు అర్థం కాదు" "లేదమ్మా..! ఇంకెప్పుడూ రాను. ఎక్కడికీ రాను. సరేనా..! క్షమించు." అని ప్రాథేయపడింది. ఊహ తెలిసిన దగ్గర్నుంచి సంధ్యకు వాళ్ల అమ్మంటే పడదు. కనీసం 'అమ్మా' అనే మాట కూడా పలకదు.

ఒక రోజు వాళ్ల లెక్చరర్ దగ్గర్నుంచి సంధ్యకి పిలుపొస్తే వాళ్లింటికి వెళ్లింది. "రారా..! సంధ్య..! మేడ మీదికి వెళ్దాం." అని లెక్చరర్ ఆమె చేయి పట్టుకుని తీసుకెళ్లింది. ఒక గదిలోకి తీసుకెళ్లి వాళ్లమ్మను పరిచయం చేసింది. సరిగా కదల్లేని ఆమె కళ్లతో దీవించినట్టు సంధ్య వైపు చూసింది. సంధ్య నమస్కారం చేసి పక్కన కుర్చీలో కూర్చునే లోగా దుర్వాసన వచ్చి.. యాక్ అంటూ ముక్కు మూసుకుంది సంధ్య. "ఛీ..! ఏమిటీ మేడమ్ ఈ కంపు..." అంది. "మా అమ్మ మళ్లీ బాత్‌రూమ్‌కి వెళ్లేసుంటారు. చూస్తానుండు. నువ్వు బయటకు వెళ్లు." అంటూ చచ్చుబడిన రెండు కాళ్లను జాగ్రత్తగా పక్కకు అంటూ శుభ్రం చేసింది. తాను కూడా స్నానం చేసి కాసేపటికి టీతో సంధ్య దగ్గరకు వచ్చింది. అదంతా గమనించిన సంధ్య "అమ్మో! ఏం బాగోలేదు మేడమ్. ప్లీజ్ సెండ్ హర్ టు ఓల్డేజ్ హోం" అని ఉచిత సలహా ఇచ్చింది. "సరేగానీ.. అమ్మానాన్నల గురించి నీ అభిప్రాయం ఏమిటి సంధ్య..?" అని అడిగింది లెక్చరర్.

"నాన్న భలే ఉండాలి. ఆ సినిమాలో ఉంటారే అలా. మురిపెంగా చూసుకోవాలి. అమ్మ సీరియల్స్‌లోలా ఎప్పుడూ హుందాగా ఉండాలి. బాగా రెడీ అయ్యి కనిపించాలి. అప్పుడు భలే ఉంటుంది మేడమ్..!" అంటూ ఏవో ఊహిస్తోంది. కొన్ని సినిమాలు, సీరియల్స్ పిల్లల్ని ఎలా చెడగొట్టేశాయో సంధ్యను చూస్తే అర్థమయ్యిందా లెక్చరర్‌కి. "నువ్వు ఇంత అందంగా ఉండడానికి కారణం మీ అమ్మే కదా" అందామె. "కాదు మేడమ్. నేనే..!" వెంటనే బదులిచ్చింది సంధ్య. "ఎలా..?" "ఎందుకంటే అలా మా అమ్మ ఉన్నా అందంగానే పుట్టాను. నాలుక చంపుకుని అయినా అందాన్ని జాగ్రత్తగా మెయింటైన్ చేస్తాను. నేను బాగా రెడీ అవుతానని మేకప్ చేస్తానని ఫ్రెండ్స్ కూడా కుళ్లుకుంటారు." అని ఒకింత గర్వంగా ఫీలయ్యింది

సంధ్య. లెక్చరర్ విసుగ్గా నవ్వింది.

ఇంతలో పక్కింటావిడ వారి డాబా పైకి వచ్చింది. "అదేంటి మీ బుడ్డోడికి నలుగు స్నానం టైమ్ అయ్యింది కదా. కాసేపట్లో ఇల్లు దద్దరిల్లిపోతుందని సిద్ధంగా ఉంటే మీరేంటి ఇలా వచ్చారు." అని ఆశ్చర్యపోయింది లెక్చరర్. "మా బుడ్డోడికి నలుగు పెట్టడానికి ఛాయపిండి అయిపోయింది. మావారు తేవడానికి ఇందాకె వెళ్లారు. అదిగో వచ్చేసినట్టున్నారు. అన్నీ సిద్ధం చేసుకోవాలి. మళ్లీ వస్తాను." అంటూ కంగారుగా దిగిపోయింది. లెక్చరర్‌తో ఇంకేదో మాట్లాడుతూనే సంధ్య పక్కింటావిడ చేస్తున్న పనులన్నీ గమనిస్తోంది. పిల్లాడికి నలుగు పట్టిన తీరు.. స్నానం తర్వాత కళ్లు మండుతున్నా నిప్పు రాజేసి సాంబ్రాణి వేస్తున్న విషయం. ఆ తర్వాత అందంగా బుజ్జాయిని రెడీ చేసి కాటుక పెట్టి మెటిక విరిచిందీ అంతా టీ తాగుతూనే చూసింది. లెక్చరర్ కూడా కావాలనే సంధ్యను కదిలించకుండా ఊరుకుంది. "సరే! త్వరగా ఇంటికి వెళ్లు." అంటూ నుదుటి మీద ఒక ముద్దిచ్చి ఇంటికి పంపింది.

సంధ్య ఏదో ఆలోచిస్తూ వెళ్తోంది. వీధి చివరన ఉన్న ఆస్పత్రి నుంచి ఓ తల్లీ కూతురు వస్తున్నారు. పాపకు ఓ ఆరేళ్లుంటాయేమో. ఒళ్లంతా పుళ్లతో జుగుప్సగా ఉంది. చిన్నారి ఏడుస్తుంటే 'ఊరుకోమ్మా..! తగ్గిపోతుందిలే..! ఇంజెక్షన్ నొప్పీ పోతుందిలే..' అంటూ గడ్డాన్ని చేత్తో తడిమి భుజానికెత్తుకుంది. పాప అదే పనిగా ఏడుస్తుండటంతో.. తలను గట్టిగా ఆనించి ఆమె కూడా కంటతడి పెట్టుకుంది. సంధ్య షాక్ అయ్యింది. చూడనిదేదో చూసినదానిలా అక్కడే నిలబడిపోయింది. ఆమె ఎలా ఆ పాపను ముట్టుకోగలుగుతోందో సంధ్యకు అర్థం కావడంలేదు. మామూలు పిల్లలానే దగ్గరికి తీసుకోవడం.. ఏడుస్తుంటే బుజ్జగించడం... పుండ్లు తగులుతున్నాయన్న స్పృహే లేకుండా తడమడం సంధ్యను ఆలోచనలో పడేశాయి. లెక్చరర్... పక్కింటావిడ... ఇప్పుడీ అమ్మ... ఒకరి తర్వాత ఒకరు ఆమె ఆలోచనల్ని చుట్టుముట్టారు. లీలగా తన తల్లి గుర్తొచ్చింది. సంధ్య తన అందాన్ని అద్దంలో చూసుకుని మురిసిపోతుంటే ఆ పక్కనే నిలబడి 'నా తల్లే' అంటూ మెటికలు విరుచుకునే అమ్మ గుర్తొచ్చింది. ముసుగు తొలగినప్పుడల్లా కసురుకుంటుంటే... మూలకు వెళ్లి రోదించే అమ్మ దృశ్యం కనిపించింది. సంధ్య కళ్లలో నీళ్లు తిరిగాయి. కానీ ఎందుకలా అనిపించిందో అర్థం కాలేదు. అర్థం చేసుకునే ఆలోచన కూడా చేయలేదు. తనను తానే తమాయించుకుని ఎప్పటిలానే ఇంటికి వెళ్లింది సంధ్య.

తలుపుకి తాళం వేళ్లాడుతోంది. "హమ్మయ్యా..! ఎక్కడికో వెళ్లుంటుంది." అనుకుని పూలకుండీ కింద ఉన్న తాళం చెవి తీసి లోపలికి వెళ్లింది. ఏదో తలభారంగా అనిపించే సరికి టీవీ ఆన్ చేసింది. 'అందమైన కల' అంటూ యువతులు బ్యూటీలుగా మారే రియాల్టీ ప్రోగ్రామ్ ఏదో వస్తోంది. దానిలో పూర్తిగా లీనమై అమ్మ ఇంటికి వచ్చింది రానిదీ పట్టించుకోలేదు. రాత్రయ్యింది. కానీ అమ్మ రాలేదు. ఎక్కడికి వెళ్లుంటుంది అనుకుని 'అమ్మో..!' రేపు కాలేజీలో పేపర్ ప్రెజెంటేషన్ ఉంది త్వరగా లేవాలి' అనుకుని 'అమ్మొస్తే.. డాబా మీద పడుకుంటుందిలే.' అని చాప దిండు బయట పెట్టింది. భోజనం చేసి తలుపేసి పడుకుండిపోయింది. తెల్లవారింది. అమ్మ వచ్చిన జాడ లేదు. కొంచెం కంగారుపడింది సంధ్య. గదులన్నీ వెతికింది. తెలిసిన వాళ్లకు ఫోన్లు చేసింది. ఆ హడావుడిలో మధ్యాహ్నామైపోయింది. ఆ చుట్టుపక్కల గుళ్లూ, పార్కులు అన్నీ వెతికింది.

లాభం లేక తలపట్టుకుని కూర్చుంది సోఫాలో. ఇంతలో వాళ్లమ్మ టేబుల్ మీద డైరీలో రెపరెపలాడుతూ ఒక తెల్లని కాగితం కనిపించింది. చేతుల్లోకి తీసుకుంది.

"చిట్టి తల్లి సంధ్యకు,

ఇంక నేను నీకెప్పటికీ కనిపించి ఇబ్బంది పెట్టను. సరేనా..! నీకు నచ్చినట్టు నీ జీవితాన్ని జీవించు. నీకు ఇష్టం లేని నేనే నీ కంటికి కనిపించనంత దూరంగా వెళ్లిపోతున్నాను. నేను బతికున్నంత వరకూ నిన్ను గుర్తు చేసుకుంటూనే ఉంటాను. నువ్వు నా ప్రాణానివి." అని రాసి ఉంది. సంధ్య నిర్ఘాంతపోయింది. తల్లి గురించి పదేపదే ఆలోచనలు. ఏదో బాధ. పంచుకోడానికి తండ్రి లేడు. ఇన్నాళ్లు ఇద్దరే కలిసి బతికారు. తనకెంతోమంది స్నేహితులు. వాళ్లే అమ్మ కన్నా ఎక్కువ. కాన్నీ అమ్మకు అన్నీ తానే. తాను ఇన్నాళ్లు ఏం తప్పు చేసిందో సంధ్యకు అర్థమవుతోంది. ఇంతలో ఫోన్ మోగింది. అమ్మే అనుకుని 'హమ్మయ్య' అనుకుంటూ ఫోన్ ఎత్తింది. అటువైపు లైన్‌లో ఎవరో బంధువు. "అమ్మా అప్సర ఉందా అని" అడుగుతున్నారు. అప్సర ఎవరో తెలీదు. "అలాంటి వాళ్లు ఎవరూ లేరే" అని అనగానే "నువ్వు సంధ్యవు కదూ..?" అని అడిగారు. "హా..! అవును" "అదేంటమ్మా..! మీ అమ్మ పేరు మర్చిపోయావా..! అవున్లే అందరూ పెద్దమ్మా పెద్దమ్మా అని పిలుస్తారు కదూ. సరే మీ అమ్మకు ఫోన్ ఇవ్వు." "అమ్మ లేదు. నిన్నటి నుంచి కనిపించడం లేదు" అని గొంతు తమాయించుకుంది. "అప్సర మా అమ్మపేరా..? అయినా మీరెవరు నేను కూడా ఎలా తెలుసు." అని ప్రశ్నించింది సంధ్య. "నేను మీ అమ్మ ఒకే చోట పని చేసేవాళ్లం." "ఏం పని" "చెప్పలేనమ్మా" "అదేంటి..! మా అమ్మ గురించి నాకేం తెలీదా..! నేను ఎప్పుడూ నాన్న గురించి అడిగేదాన్నే కానీ అమ్మ గురించి పట్టించుకుంది లేదు.

ఇప్పుడు అమ్మ ఎక్కడికో వెళ్లిపోయింది. ప్లీజ్ మా అమ్మ గురించి మీకు బాగా తెలుసనుకుంటా. ప్లీజ్ చెప్పండి. ఆమెను దక్కించుకునే అవకాశం ఇవ్వండి." అంటూ ప్రాథేయపడింది. అటువైపు కాసేపు ఏం మాట్లాడలేదు. "హలో... హలో...! ఉన్నారా...!" "సరేనమ్మా..! ఇలాంటి సమయంలో ఫోన్ చేస్తానని అనుకోలేదు. సరే మీ అమ్మ గురించి చెబుతా. మీ అమ్మ ఉండే గూడెం ఏదో అటవీ ప్రాంతంలో ఉండేదట. అక్కడా కొన్ని కుటుంబాలున్నాయనే విషయం బయటి ప్రపంచానికి సరిగా తెలీదట. చిన్నప్పుడే ఆమెను కొనేశారట. అప్సరకు ఆరుగురు తోబుట్టువులుండే వారట. అందర్ని పెంచలేక, పూట గడవలేక, డబ్బు ఆశకి తల్లిదండ్రులే గంజాయి వ్యాపారులకు అమ్మేశారట. నాది అలాంటి కథే. ఎవరెక్కడున్నామో తెలీదు. అలా నేను ఒక వేశ్యావాటికకు చేరాను. అక్కడ మీ అమ్మతో స్నేహం కుదిరింది. ఒక రోజు కొంతమంది బ్రోకర్లు వచ్చి ఇక్కడి తెల్లటి ఆడవాళ్ల చర్మాలు కావాలంటూ అవి ఎన్నో లక్షల విలువ చేస్తుందంటూ వాటిని ఎలాగైలా సంపాదించాలనే విషయమై ఒప్పందాలు కుదుర్చుకున్నారని తెలిసింది. ఎందుకో, ఏంటో వాళ్లెవరో, అసలు చర్మంతో పనేంటో ఏమీ తెలీదు. మమ్మల్ని ఏళ్లకు ఏళ్లు పెంచినా అంత డబ్బు రాదని.. ఒకేసారి అంత మొత్తం అందడం కష్టమని.. కొందరిని ఎంచుకున్నారు యజమాని. వారిలో మీ అమ్మ ఒకర్తె. ఒక అమ్మాయి చర్మాన్ని అప్పటికే తీసుకెళ్లారని.. ఆమె ఎదురు తిరగడంతో విషయం బయటికి పొక్కకుండా కాలువలో తొక్కి చంపేశారని తెలిసి మిగతా వాళ్లంతా ఒప్పుకున్నారు. మీ అమ్మను చర్మం కోసం తీసుకెళితే గుండె ఆగినంత పనైంది. కానీ, నోరు మూసుకుని కూర్చున్నాను. తర్వాత కొన్నిరోజులకు మీ అమ్మ ఎందుకూ పనికి రాదని కొంత డబ్బిచ్చి రోడ్డు మీదికి తోసేశారు. అంతకు ముందే మీ అమ్మ గర్భిణి. ఎవరికీ తెలీకుండా జాగ్రత్త పడుతూ వస్తోంది. అలా ఆమె బయటకు వచ్చి ఏదో పని చేసుకుంటూ నిన్ను కనిపెంచింది. అప్పుడప్పుడు నేనూ డబ్బు సర్దుతూ వచ్చాను. కానీ ఈ విషయాలేవి నీకు చెప్పొద్దంటూ... రూపం బాలేకున్నందుకే నీవు అసహ్యించుకుంటు న్నావని... ఈ విషయం తెలిస్తే తట్టుకోలేనని బాధపడేది. తరువాత కొద్ది రోజులకు ఇక్కడి వాతావరణం, ఇక్కడ జరిగే నేరాలు, అన్యాయాల గురించి ఒక ఎన్జీవో ద్వారా పత్రికల్లో వచ్చింది. నేనూ బయటపడ్డాను. వారికి మీ అమ్మ సంగతి చెప్పి సాయమందేలా చూశాను. ఇప్పుడు మనం ఉంటున్న ఈ రెండు గదుల ఇల్లూ ఎవరో దానం చేశారు. నువ్వెంత అదృష్టవంతురాలివో..! నేను ఎందుకు పుట్టానా అని నా కన్నవాళ్లు బాధపడి ఎలా పెంచాలో తెలియక మురికి కూపానికి అమ్మేశారు. కాని నీ జీవితం అలా కాకూడదని మీ అమ్మ ప్రయత్నం. నీకో అందమైన జీవితమివ్వాలని..." అని అటువైపు మనిషి మాట్లాడుతుండగానే ఫోన్ చేతిలోంచి జారిపోయింది. నేల మీద కూలబడిపోయింది సంధ్య. "అమ్మా.. అమ్మా...!" అనే వేదన ఆ మాటల్ని కంటి ధారతో జారవిడిచింది. ఏడుస్తూనే అలా అక్కడే పడిపోయింది. చాలాసేపటి తర్వాత మెళకువ వచ్చింది సంధ్యకు. భయపడిపోయింది.. అమ్మ ఏమైందని.. అమ్మ లేని ఆ ఇంటిని చూసి. లెక్చరర్‌కు విషయం చెప్పింది. నువ్వు ఇంట్లోనే ఉండు... నేను వస్తున్నా అని చెప్పడంతో కాస్త నెమ్మదించింది కానీ దిగులుగానే ఉంది. ఇంతకుముందు మాట్లాడిన ఆమెకు మళ్లీ ఫోన్ కలిపింది. "అమ్మా సంధ్య..!" అన్నమాట వినగానే ప్రాణం లేచొచ్చింది సంధ్యకు. అది తన తల్లి గొంతు. ప్రేమనంతా కలిపి ఆప్యాయంగా రోజూ పిలిచే గొంతు. "క్షమించమ్మా..! ఆ పాటికి అలాంటి నిర్ణయం తీసుకున్నాను. చదువులేని మొద్దుని కదా. అయినా నీ బిడ్డను చూడకుండా నేనెక్కడికి పోతాను. ఇదిగో అమ్మా! నా స్నేహితురాలితోనే ఇంటికి వస్తున్నా.. అయినా నీకు ఈ నెంబర్ ఎలా తెలుసు. ఫోన్‌లో వెతికావా...! సరేనమ్మా నిన్ను కంగారు పెట్టినందుకు, బాధపెట్టినందుకు ఈ పిచ్చితల్లిని క్షమించు. అప్పుడప్పుడూ 'ఫోన్ ఎక్కడి నుంచి' అని అడిగేసి అంతలోనే 'నాకెందుకు నీ విషయం' అనుకుంటూ వెళ్లిపోతావే.. ఆ స్నేహితురాలే ఈమె.." అని అప్సర అంటుండగానే ఫోన్‌ను ఆమె స్నేహితురాలు తీసుకుంది. "మీ అమ్మ కథ నీకు చెప్పాననే విషయం తనకు తెలీదు. నువ్వూ అలానే ఉండు." అంటూ పక్కకు వెళ్లి మాట్లాడిన ఆమె మళ్లీ అప్సర దగ్గరకు వచ్చి "పోనీలేమ్మా! ఇలా అన్నా మీ అమ్మ నన్ను నీకు పరిచయం చేస్తోంది." అంటూ నవ్వింది. "మీకు నన్ను కాదు పెద్దమ్మా... అమ్మనే నేను నా స్నేహితులందరికీ పరిచయం చేస్తా..." అంటూ ఫోన్‌ను గట్టిగా గుండెకు ఆనించుకుంది సంధ్య. 'అమ్మ' సంధ్యకు అప్పుడే సరిగ్గా పరిచయమైంది.

◆

కథలకు ఆహ్వానం

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం స్నేహ కథలకు ఆహ్వానం పలుకుతోంది. మంచి కథలను ఎంపిక చేసి ప్రచురిస్తాం. కథ సమకాలీన పరిణామాలు, పరిస్థి తుల నేపథ్యంగా వుండాలి. ప్రపంచీకరణ నేపథ్యంలో వివిధ రంగాల్లో చోటు చేసుకున్న, చేసుకుంటున్న విపరిణామాలను కథాంశంగా తీసుకోవచ్చు. ప్రగతిశీల చైతన్యాన్ని, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించే కథలకు ప్రాధాన్యత. మూఢ నమ్మకాలు పెంచేవిగా, ఏ సామాజిక తరగతిని ప్రత్యేకంగా నొప్పించేదిగా వుండకూడదు. మాండలికాలు ఉపయోగించినా కథన శైలి అందరికీ బోధ పడేలా వుండాలి. నవ్యత, వైవిధ్యం కలిగిన కథలకు ప్రత్యేక ఆహ్వానం.

నిబంధనలు

కథ నిడివి ప్రింటులో మూడు ఎ4 కాగితాల్లో వుండాలి. చేతిరాతలో అయితే 8 నుంచి 10 కాగితాల్లో వుండాలి. ప్రింటయినా, చేతిరాతైనా కాగితానికి ఒక వైపు మాత్రమే వుండేలా... జిరాక్స్ ప్రతిని పంపాలి. కథలను తిప్పి పంపడం వుండదు. పేరు, పూర్తి చిరునామా, ఫోన్ నెంబరు తప్పక రాయాలి. మా చిరునామా: స్నేహ, ప్రజాశక్తి దినపత్రిక, హౌస్ నెం. 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.

మెయిల్ అడ్రస్:

snehaweekly.praja@gmail.com

-ఎడిటర్

షాంఘై టవర్‌ని చూసి..



నేను చూసిన చైనా - 2వ భాగం

ఏ దేశ భవిత అయినా యువత చేతిలోనే ఉంటుంది. యువతలో దేశభక్తిని పెంచడానికి చైనా ప్రభుత్వం చేస్తున్న అనేక ప్రయత్నాలలో ఒకటి విదేశీ దాడులను గూర్చీ, ఆ దాడులలో, జరిగిన మారణకాండలలో చనిపోయిన తమ ప్రజలను గూర్చీ, నిరంతరం గుర్తుచేయడం. 1937 చివరిలో చైనాలోని నాన్‌జింగ్ నగరంపై జపాన్ వారు దాడి జరిపి, ఆరువారాల్లో 3లక్షల 40 వేల మంది చైనీయులని హతమార్చారు. అనేక వేల మంది స్త్రీలను చెరిచారు. ఆ ఘూతుకాన్ని ప్రజల మనుస్సుల్లో నుండి చెరిగిపోకుండా ఉంచేందుకు 1949లో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం "నాన్‌జింగ్ మాసేకర్ మ్యూజియం"ను నెలకొల్పింది. దానిలో ఆనాటి భయానక, బాధామయ దృశ్యాలను అనేక శిల్పాలుగానూ, మరికొన్ని అలనాటి తవ్వకాల్లో దొరికిన అస్థిపంజరాలను అలాగే ఉంచి ప్రదర్శించింది. ఆ ప్రదర్శనశాలకు సంబంధించిన వివరణలో "ప్రజలలో దేశ భక్తిని పెంచేందుకు ఈ మ్యూజియం ఏర్పాటు చేయబడింది" అని రాయబడింది. ఆ మ్యూజియం చివరిలో ఒక పెద్ద స్త్రీ మూర్తి విగ్రహం నెలకొల్పబడింది. ఆ విగ్రహం క్రింద "పీస్" (శాంతి) అని రాసుంటుంది. అంటే ఆ మ్యూజియం నెలకొల్పడంలో అంతిమ లక్ష్యం శాంతి నెలకొల్పడం అని స్పష్టంగా అర్థమవుతోంది. ఆ మ్యూజియంను ఏప్రిల్ 28వ తేదీన మేము సందర్శించి, యుద్ధ ఫలితాలు ఇంత భయంకరంగా ఉంటాయా? అని బాధ పడ్డాము.

28వ తేదీన సాయంత్రం చైనా దేశపు గొప్ప తత్వవేత్త, విద్యావేత్త, రాజనీతిజ్ఞుడు అయిన కన్‌ఫ్యూషియస్ దేవాలయానికి వెళ్లాం. ఈయన బుద్ధుని సమకాలీకుడు. కన్‌ఫ్యూషియస్ మతస్తులు ఈయనను దైవంగా కొలుస్తారు. వీరు చైనా జనాభాలో ఒక శాతం లోపే ఉన్నారు. కన్‌ఫ్యూషియస్, క్రీ.పూ. 551లో జన్మించి 479లో మరణించాడు. ఆయన దేవాలయాన్ని 1993లో చైనా ప్రభుత్వం నిర్మించి, అందులో కన్ ఫ్యూషియస్ యొక్క భారీ కంచు విగ్రహాన్ని నెలకొల్పింది. ఆ విగ్రహం ఎత్తు 4.18 మీటర్లు, బరువు 2 1/2 టన్నులు. ఆ దేవాలయంలోనే కన్‌ఫ్యూషియస్ నెలకొల్పిన విశ్వవిద్యాలయ వివరాలన్నీ ఒక మ్యూజియంగా ఏర్పాటు చేసి భద్ర పరచబడ్డాయి. దిగ్భ్రాంతిని కొల్పే విషయమేమంటే, విద్యార్థులు ఆ రోజుల్లోనే రకరకాల పద్ధతుల్లో కాపీలు కొట్టేవాళ్ళు. ఒక విద్యార్థి తన కాలిమేజోళ్ళపై ఆన్సర్లు రాసుకొని వెళ్ళి, విద్యాధికారులకు పట్టుబడ్డాడు. ఆ మేజోళ్ళు ఆ మ్యూజియంలో ఇప్పటివరకూ భద్రపరచబడ్డాయి. కన్‌ఫ్యూషియస్ జీవిత చరిత్ర అంతా పెయింటింగ్ ల రూపంలో ఆ దేవాలయంలో చిత్రించబడ్డాయి.

బుద్ధ దేవాలయాలలో లాగానే కన్‌ఫ్యూషియస్ దేవాలయంలో భక్తులు ధూప, దీప, ప్రమాణాలు అర్పిస్తున్నారు. అంతేకాదు కోరిన కోర్కెలు తీరడం కోసం దేవాలయ ఆవరణలోని చెట్లకు ప్లాస్టిక్ ఆపిల్ పండ్లను కడుతున్నారు. నీళ్ళకుండీలలో నాణేలు వదులుతున్నారు.

ఏప్రిల్ 29న చైనా జాతి పిత (మనకు మహాత్మాగాంధీ లాగా) సన్-యట్- సేన్ సమాధిపై నెలకొల్పిన ఆయన విగ్రహాన్ని సందర్శించాము. ఆ విగ్రహం నాన్‌జింగ్ నడిబొడ్డున ఉన్న 'పర్ప్యల్ కొండ'పై ఉన్నది. ఆ విగ్రహాన్ని చేరడానికి 354 మెట్లు ఎక్కి వెళ్ళాలి. మేమందరం 50-70 ఏళ్ళ మధ్య వాళ్ళమే అయినా ఒకళ్ళనొకళ్ళు ఉత్సాహపరచుకొంటూ, మధ్య మధ్య మెట్లపై విశ్రాంతి తీసుకుంటూ కొండ ఎక్కిదిగాము.

సన్-యట్-సేన్, కమ్యూనిస్టులతో సహా అన్ని దేశ భక్తి యుత శక్తులనూ కూడగట్టి, అప్పటి వరకు చైనాను పరిపాలించిన నిరంకుశ రాచరికాన్ని కూలద్రోసి, చైనా ప్రజలకు మొదటి సారిగా ప్రజాస్వామ్య పాలనను అందించిన మహానేత ఆయన సమాధిని దర్శించడానికి వేలాదిగా ప్రజల తరలిరావడం మమ్మల్ని ఆశ్చర్యానికి గురి చేసింది.

ఏప్రిల్ 30 ఆదివారం నాడు ఉదయం మరో బుల్లెట్ ట్రైన్‌లో బయలుదేరి మధ్యాహ్నానికి షాంఘై చేరాము. భోజనాలు ముగించుకొని షాంఘై చూడటానికి బయలుదేరాము. టైం ఎక్కువ లేనందువలన కొన్ని ముఖ్యమైన ప్రదేశాలని బయటి నుండే చూడవలసి వచ్చింది. వాటిలో "పెరల్ టవర్" ఒకటి. అది చాల ఎత్తైన టివి టవర్. దాని ప్రత్యేకత ఏమిటంటే, రాత్రిపూట పింక్ కలర్ లైట్లతో వెలిగిపోతుంది. అందువలన దానిని పెరల్ టవర్ అని పిలుస్తారు. ఆ తరువాత ప్రపంచంలోనే ఎత్తైన "షాంఘైటవర్" చూశాము. దాని ఎత్తు 632 మీటర్లు. అంటే 2073 అడుగులు. అది 128 అంతస్తుల బిల్డింగు. దాని నిర్మాణ ఖర్చు 2.4 బిలియన్ డాలర్లు అంటే 16 వేల కోట్ల రూపాయలపైనే ఖర్చయింది. దానిని 2016లో ప్రజల సౌకర్యార్థం తెరిచారు. తర్వాత హవాంగ్ పు నదికి రెండువైపులా ఉన్న భవనాలను సాయంత్రం వేళ లైట్ల వెలుగులో చూశాము. వాటి ప్రత్యేకత ఏమిటంటే, నదికి ఒకవైపున 17, 18 శతాబ్దాలలో యూరోప్‌లో ఉన్నటువంటి భవన నిర్మాణ శైలిలో ఉన్న భవనాలు అనేకం ఉన్నాయి. వాటి లైటింగ్ కూడ ఒకే రంగు దీపాలతో ఉండి, పాత కాలపు భవనాలను గుర్తు చేస్తాయి. నదికి రెండోవైపున ఇటీవల నిర్మించిన అనేక అంతస్తుల ఆధునిక భవనాలు ఉన్నాయి. అవి రంగురంగుల బల్బుల కాంతులతో అత్యంత ఆధునికంగా, ఆకర్షణీయంగా కనిపిస్తాయి. ఆ రెండు రకాల భవనాలను చూసి

రైల్వేస్టేషన్‌కు బయలుదేరాము. విశేషమేమిటంటే నదిఒడ్డు నుండి ఒక్కొక్కటీ దాదాపు 2మీటర్ల వెడల్పు ఉన్నా, ఇసకవేస్తే రాలనంత మంది ఉన్నారు. ఆదివారాలలో ఆ నది ఒడ్డున రంగురంగుల దీపకాంతులతో వెలిగే అక్కడి భవనాలను చూడటానికి వేలాదిగా ప్రజలు వస్తారని మాకు అర్థమైంది.

అక్కడ విశేషం ఏమిటంటే, వేల సంఖ్యలో ఉన్న ప్రజలు ప్రశాంతంగా ముందుకు సాగడానికి స్థానిక పోలీసులతోబాటు, రోడ్డు మధ్యలో మిలిటరీ కూడా అందుబాటులో ఉండటం. మిలిటరీ వాళ్ళు, దళాలు దళాలుగా, రోడ్డు మధ్యలోనే ప్రతి 100 మీటర్లకూ ఒక దళం చొప్పున కవాతు చేస్తూ కనిపించారు. అందువలన ఏ మాత్రం తొక్కిసలాట లేకుండా వేలాది జనం క్రమ శిక్షణతో, ప్రశాంతంగా ముందుకు సాగారు. షాంఘై నుంచి మరో బులెట్ ట్రైన్‌లో బయలు దేరి రాత్రి 10.30 కు రాంబాబు వాళ్ళ ఇంటికి చేరాము.

మే 1న విశ్రాంతి తీసుకొని నాంజింగ్‌లో షాపింగ్ చేశాము. షాపింగ్‌లో ఆ దేశంలో ఎక్కడైనా ఒకటే విశేషం. వస్తువు రేటు చాలా ఎక్కువ చెబుతారు. బేరం చేస్తే చెప్పిన రేటులో కనీసం మూడవ వంతు రేటుకు ఇచ్చివేస్తారు.

మే 2న రెండు కార్లలో బయలుదేరి ఊసీ అనే చిన్న పట్టణానికి వెళ్ళాము. అక్కడ 'లింగ్ షాన్ టెంపుల్' అనే ప్రసిద్ధ బౌద్ధాలయం ఉంది. ఆ ఆలయంలో విశేషం ఏమిటంటే, అది 74 ఎకరాలలో విస్తరించిన ఆలయం. అందులో ఒక కొండ మీద 88

మీటర్ల ఎత్తున బ్రహ్మాండమైన బుద్ధుని కంచు విగ్రహం ఉంది. అది అమెరికాలోని 'స్టాట్యూ ఆఫ్ లిబర్టీ' కంటే రెండు రెట్లు పెద్దది. ప్రపంచంలోని అతిపెద్ద విగ్రహాలలో తొమ్మిదవది. విశేషం ఏమిటంటే ప్రపంచంలోని అతిపెద్దవిగ్రహం చైనా దేశంలోని 'స్ప్రింగ్ టెంపుల్ ఆఫ్ బుద్ధా' అనీ, దాని ఎత్తు 128 మీటర్లు అనీ రాంబాబు నెట్‌లో చూసి మాకు చెప్పాడు.

ఊసీలోని బుద్ధదేవాలయాన్ని ప్రస్తుత చైనా ప్రభుత్వం నిర్మించింది. ఆ దేవాలయ దర్శనానికి ప్రతిరోజూ వేలాది మంది భక్తులు వస్తున్నారు. దానిలో తిరగడానికి బ్యాటరీ కార్లు ఉన్నాయి.

ఒకసారి టికెట్ తీసుకుంటే ఒక ప్రదేశంలో ఆగి, దానిని చూసుకుని మరల ఇంకొక కారులో రెండవచోటికి వెళ్ళవచ్చు. ఆ కార్ల టికెట్ తీసుకొని, ఒక బ్యాటరీ కార్ ఎక్కి 'లోటస్ బాలబుద్ధ' విగ్రహం దగ్గర దిగాము. అక్కడ బాలబుద్ధుని కంచు విగ్రహం 23.6 అడుగుల ఎత్తున్నది, ఒక పద్మంలో ఉన్నది. ఆ పద్మం ఎప్పుడూ మూసుకొని ఉంటుంది. ప్రతిరోజూ 10-00, 11-30, 13-00, 14-45, 16-45కు దాని చుట్టూ ఉన్న ఫౌంటెన్లు, మ్యూజిక్‌కు అనుగుణంగా నీరు చిమ్ముతుంటాయి. క్రమంగా పద్మం వికసిస్తుంది. బుద్ధుడు నెమ్మదిగా 360 డిగ్రీలు తిరుగుతుంటాడు. అప్పుడు నాలుగువైపులా ఉన్న 9 డ్రాగన్ బొమ్మల నోళ్ళలో నుంచి ఎక్కువ వేగంతో నీరు చిమ్మబడుతుంది. బాలబుద్ధుడు తడిసిపోతాడు. దానినే 'బాలబుద్ధుని స్నానం' అని అక్కడి వారు పిలుస్తారు. మేము సరిగ్గా 11-30కు అక్కడికి చేరాము కాబట్టి బాలబుద్ధ స్నానాన్ని చూడగల్గాము. ఆ దేవాలయంలోని మరో ముఖ్య విశేషం ఏమిటంటే దానిలో ఒక 'అశోక పిల్లర్'ను ప్రతిష్టించారు. అది 55.4 అడుగుల ఎత్తు, 200 టన్నుల బరువూ ఉన్న ఒక పెద్ద గ్రానైట్ స్తంభం. దానిని చూసుకొని, మరో బ్యాటరీ కార్ ఎక్కి బుద్ధ విగ్రహం అడుగు చేరాము. అక్కడి నుంచి లిఫ్ట్‌లో బుద్ధుని పాదాల వద్దకు చేరాము. అక్కడ దాదాపు వెల్లికిలా పడుకున్నంత పని చేస్తేనే బుద్ధుని తల భాగం కనిపిస్తుంది. అనేకమంది చైనీయులు బుద్ధునికి భక్తితో ప్రణామాలు చేస్తున్నారు. అక్కడ కొంతసేపు గడిపి, కొండదిగివచ్చి, 'బ్రహ్మాపాలెస్' అని పిలువబడే బ్రహ్మాండమైన థియేటర్‌లోనికి ప్రవేశించాము. దానిలో 1000కి పైగా స్టూలు ఆకారంలో దిండ్లు ఉన్నాయి. ఐమాక్స్ థియేటర్లలోని స్క్రీన్స్ కన్నా 5 రెట్లు పెద్దదైన అర్ధచంద్రాకారపు స్క్రీన్ ఉంది. షో మొదలు కావడానికి ముందు థియేటర్ పైకప్పులోని వందలాది బల్బులు నిరంతరం రంగులు మారుస్తూ ప్రేక్షకులను ఆశ్చర్య చకితులను చేశాయి. అక్కడ షోలు 10-35, 11-30, 14-00, 16-00కు మొదలవుతాయి. మేము 14-00 షో సమయానికి చేరుకోగలిగాము. కథాంశం గౌతముడు బుద్ధుడుగా మారడం. కొంత భాగం తెర మీద చూడటం జరిగింది. తరువాత తెరఎత్తి చూసి రంగస్థలంగా మార్చి గౌతముడు చూసిన బాధామయ సన్నివేశాలు చూపారు. చివరకు గౌతముడు రావిచెట్టు కింద బుద్ధుడుగా మారిన సన్నివేశం ఆ షోకే హైలెట్. కింది భాగం నుంచి రావిచెట్టు నెమ్మదిగా పైకి లేస్తుంటుంది. దాని కింద జ్ఞాన బుద్ధుడు కూర్చుని ఉంటాడు. ఆ చెట్టు పైకి లేచి బుద్ధుడు కనిపించడంతో షో అయిపోతుంది. 20 నిమిషాల ఆ షో ఆద్యంతం ప్రేక్షకులను సంభ్రమాశ్చర్యాలకు గురి చేస్తుంది.

ఆ తర్వాత 10,000 బుద్ధుల ఆలయాన్ని చూశాము. మన దేశంలో కోటి లింగాల తీర్థాలులాగే, అందులో కొన్నివేల చిన్న బౌద్ధ విగ్రహాలున్నాయి. భక్తులు వాటిని తీసుకువచ్చి అక్కడ ప్రతిష్టిస్తున్నారని తెలిసింది. మేము బయటికి వచ్చే సరికి 16-30 అయింది. అందువలన బాలబుద్ధుని దగ్గరకు చేరి 16-45కు మొదలైన బాలబుద్ధ స్నానాన్ని మరో సారి చూసి, బుద్ధుని పంచ ముద్రల మహల్‌ను దర్శించి, కార్లలో ఇంటి ముఖం పట్టాము.

మే 3న నాన్‌జింగ్ మ్యూజియంకు వెళ్లాము. అక్కడ పురాతన చరిత్రను వివరించే ప్రత్యేక విభాగం ఉంది. దానిలో పాతరాతి యుగం నాటి పనిముట్లు, ఆయుధాల నుంచి ఆధునిక కాలం వరకు చైనా చరిత్రను వివరించే వస్తువులు ఉన్నాయి. ముఖ్యమైన విశేషం ఏమిటంటే చైనా విద్యార్థులకు ఆ విభాగాన్ని చూపే ప్రయత్నం ఉపాధ్యాయులు చేస్తున్నారు. మేము వెళ్లిన రోజు కనీసం 15 స్కూళ్ల పిల్లలను ఆ మ్యూజియానికి ఉపాధ్యాయులు తీసుకువచ్చారు. మానవజాతి చరిత్రను అలనాటి పనిముట్లు, ఆయుధాలు, ఆభరణాలు చూపించి విద్యార్థులకు వివరించే ప్రయత్నం మమ్ముల్నెంతో ఆకర్షించింది.

మే 4న విశ్రాంతి, షాపింగ్ అందరం దాదాపు ఒకే ఈడు వాళ్ళం కావడంతో ఆనందంగా సాగింది. మే 5 ఉదయం 7 గం. నేను నా భార్య షాంఘై మీదుగా టొరంటో మా అబ్బాయి వద్దకు ప్రయాణం ప్రారంభించాము. మా యాత్రా బృందంలోని మిగిలిన సభ్యులు మే 6న ఇండియా బయలు దేరారు.

– కె.ఎల్. కాంతారావు



మనసు లోతుల్ని తడిమిన కథలు

చదవడం ఆరంభించి ముగించేలోగానే కొన్ని కథలు మర్చిపోతాం. మరికొన్ని కథల ప్రారంభ వాక్యాలు చూడగానే ఇక అవి చదవాలన్పించవు. ఇంకొన్ని కథలు ఒకసారి చదివినా మనసు పొరల్లో ఎక్కడో ఉన్న తడిని తట్టిలేపుతాయి. అక్షరాల దారుల్లో మనల్ని కూడా తమతో పాటు చిటికెన వేలు పట్టుకుని నడిపిస్తాయి. అలాంటి కథల సంపుటే 'నీటిపుట్ట'. రచయిత సలీం. ఆయన గురించి ప్రత్యేక పరిచయాలు అవసరం లేదు. సాహితీప్రపంచంలో తనదైన శైలిలో కథలు రాస్తున్న అతి కొద్దిమంది కథకుల్లో ఆయనొకరు. ఇప్పటికే ఎనిమిది సంపుటాలుగా తన కథలను తీసుకొచ్చిన ఆయన తన తొమ్మిదో కథల సంపుటిగా 'నీటిపుట్ట'ని తీసుకొచ్చారు.

ఈ పుస్తకంలో మొత్తం పదిహేడు కథలున్నాయి. 'గరిమనాభి'తో మొదలై 'నిశిగంధ'లో ముగిసే ఈ కథల్లో ఎంతో వైవిధ్యముంది. అయితే వీటన్నింటిలోనూ ఒకే అంత:స్సూత్రముంది. అదే మానవతాంశం. మానవీయ సంబంధాలను అత్యంత అపురూపంగా సలీం ఈ కథలన్నింటిలోనూ పాఠకులకు ఆలోచింపజేసేలా అందించారు. రచయిత దృక్పథం ఏదైనా సరే ఈ కథలన్నీ మన చుట్టూ ఉన్న ప్రపంచానికి దర్పణంగా నిలిచాయి. ఏ కథ కూడా నేల విడిచి సాముచేయదు. 'గరిమనాభి' కథలో ఒక కుటుంబాన్ని నడిపించే మహిళ మనోగతాన్ని, ఆమె అంతరంగాన్ని అందమైన అక్షరాల్లో ఆవిష్కరించారు. రెండో కథ 'నరక కూపం'లో డ్రైనేజీలు శుభ్రం చేసే తోటీల బతుకులు ఎలా ఉంటాయో, వారి దైన్యపరిస్థితిని, ఆ వృత్తితో వారు ఎదుర్కునే ఏహ్యాభావాలని కళ్లకు కట్టినట్లు చిత్రించారు. తర్వాత కథ 'గీతాసారం'లో వ్యక్తిత్వ వికాసపు వెలుగులు ఎలాంటి స్థితి. ప్రజ్ఞతని జీవితంలో అందిస్తాయో పేర్కొన్నారు. 'జో లాలీ పాపా' కథలో వేశ్యా పుత్రుడైన ఒక అధికారి అంతరంగ మానసిక సంఘర్షణనీ, అనుభవాల్నీ, ఆవేదనలనీ అసాధారణ రీతిలో వివరించారు. 'కుక్కలు' కథలో వాటిని పట్టుకునే ఉద్యోగుల తీరు తెన్నులు, ప్రభుత్వ వ్యవస్థలో వేళ్లూనుకుని ఉన్న అవినీతిని చక్కగా విశ్లేషించారు. కేవలం కుక్కలు పట్టుకునే పనిలోనే ఇన్ని రకాల అక్రమాలు ఉంటే ఇక కీలకమైన విభాగాల్లో ఏ స్థాయిలో ఉంటాయో రచయిత పాఠకుల్ని ఈ కథ ద్వారా ఆలోచించేలా చేశారు. అవయవ దానంపై చైతన్యం కలిగించే 'రెండు జీవితాలు', మగవాళ్లు కన్నీళ్లు పెట్టడం తప్పన్న ఈ వ్యవస్థ గురించి ప్రశ్నించేలా 'కన్నీళ్ళు' కథ.. ముస్లిమ్ అమ్మాయిలోని చైతన్యాన్ని 'నిఖా' కథ ప్రస్ఫుటంగా ప్రతిబింబించాయి. సరోగసీ కోసం బిడ్డని కని అతనిపై తల్లి పెంచుకున్న మమకారాన్ని 'బొడ్డుతాడు' కథలోనూ, బాల్యాన్ని గడిపిన ఇంటిని అమ్ముకోకుండా దాన్ని తల్లి జ్ఞాపకంగా మిగుల్చుకోవాలని భావించే కూతురి ఆలోచన 'వారసత్వం'లోనూ, సరిహద్దుల్లో సైనికుల జీవితాన్ని 'మంచుతల్పం'లోనూ, ఇటీవలికాలంలో మానవత్వాన్ని చూపినా అదొక బలహీనత అనుకుని బ్లాక్‌మెయిల్‌కి తెగబడే నేరగాళ్ల గురించి 'ఎదురురాయి' కథలోనూ, రైతుల ఆత్మహత్యలకు అసలైన పరిష్కారాన్ని 'పరిష్కారం' కథలోనూ, దేవుడు గుడిలో ఉండడని కొంతమంది మనుషుల్లోనే ఉంటాడని 'మాట్లాడే దేవుడు' కథలోనూ సలీం చాలా సున్నితంగా వివరించారు. ముస్లిమ్ బాలిక భరతనాట్యాన్ని నేర్చుకుంటే ఆమెకు పురుషాధిక్య సమాజం నుంచి ఎదురైన దౌర్జన్యాలు, దాడులు, చివరికి అదే ఆమెకు బతుకుతెరువు చూపించిన వైనాన్ని 'మువ్వల సవ్వడి' కథలో చదవొచ్చు. పచ్చని పంట పొలాలన్నీ కాంక్రీట్ జంగిల్స్‌గా మారిపోతుంటే నీటి అవసరాన్ని, వ్యవసాయం తాలూకు ప్రాధాన్యతని వివరించి చెప్పే చక్కని కథ 'నీటిపుట్ట'. చివరిగా ఉన్న 'నిశిగంధ' కథ చాలా సుతారమైన ప్రేమానుబంధాలను అలవోకగా, ఆత్మీయ స్పర్శలా అందించడం విశేషం. మొత్తమ్మీద ఈ సంపుటిలోని కథలన్నీ దేనికదే చదివిస్తాయి. ఇక వీటి శైలీ, శిల్పం గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతుంది. ఈ పుస్తకాన్ని చదివిన ఎవరైనా మంచి కథాసంపుటిని అందించినందుకు రచయిత 'సలీం'ని అభినందించకుండా ఉండలేరు.

నీటిపుట్ట (కథాసంపుటి)
రచన: సలీం
పేజీలు: 184, ధర: రూ 150/-
ప్రతులకు:
సలీం, ఫ్లాట్ నెం. బి-2/206,
లక్ష్మీనారాయణ అపార్ట్‌మెంట్స్
హిమాయత్ నగర్,
హైదరాబాద్-29
విశాలాంధ్ర అన్ని బ్రాంచీలు,
నవోదయ బుక్‌హౌస్,
హైదరాబాద్.



- బెందాళం క్రిష్ణారావు

సైకిల్ సిస్టర్స్



హర్యానాలో లింగ వివక్ష తీవ్రత గురించి చెప్పక్కర్లేదు. అక్కడి గ్రామాల్లో బయటకు అడుగుపెడితేనే కాదు ఇంట్లో మరో వ్యక్తి ఉంటే ముసుగు వేసుకునే తిరగాలి మహిళలు. ఇలాంటి చోట మహిళ సైకిల్ తొక్కడం అంటే పెద్ద విషయమే. ఇది ఇప్పుడు చాలా చిన్నదైపోయింది. ముఖ్యంగా గురుగావ్ నగరం చుట్టు పక్కల ప్రాంతాల్లో చాలామంది మహిళలు సైకిళ్లు తొక్కుతూ పనులకు వెళుతూ కనిపిస్తారు. ఇది మరో గ్రామీణ ప్రాంతంలో కనిపించడం అరుదు. సైకిల్ సిస్టర్స్‌గా ముద్దు పేరు తగిలించుకున్న వీరంతా కూడా నగరంలో ఇంటి పనులకు, వంట పనులకు వెళ్లేవాళ్లే. ఐటీ విప్లవంతో గురుగావ్ ముఖ చిత్రమే మారిపోయింది. పెద్ద పెద్ద అపార్ట్‌మెంట్లు, గేట్ వే కమ్యూనిటీలు, విల్లాలు, షాపింగ్ మాల్స్ ఇలా ఒక్కసారిగా మెట్రో కల్చర్ అక్కడి గ్రామీణ ప్రాంతాన్ని కబ్జా చేసింది. అక్కడి దాదాపు ప్రతి జంట కూడా ఐటీ కొలువు చేస్తుంటారు. అందుకే అక్కడ ఇంటి పనివాళ్లకు అంత డిమాండ్. ఈ అవకాశాన్ని వెతుక్కుంటూ బెంగాల్ నుంచి ఇంకా చెప్పాలంటే బంగ్లాదేశ్ నుంచి కూడా వలసలు వచ్చిన కుటుంబాలు చాలానే అక్కడి చుట్టు పక్కల ప్రాంతాల్లో కనిపిస్తాయి. వీరిలో ముస్లింలే అధికం. ఈ కుటుంబాలకు చెందిన మహిళలకు సైకిల్ తొక్కడం వచ్చు. అలానే అది వారి అత్యవసరం కూడా. నాలుగైదు ఇళ్లకు వెళ్లి పనులు చేసుకుని తిరిగి గ్రామానికి రావాలంటే ఆటోలు, బస్సులంటే బోలెడు ఖర్చు. అందుకే సైకిల్‌ను ఎంచుకున్నారు. ఈ కుటుంబాల్లో మహిళే ప్రధాన పోషకురాలు. వీరిని చూసి వీరితో స్నేహం చేసిన గ్రామీణ హర్యానా ఆడ పిల్లలు కూడా సైకిల్ అలవాటు చేసుకున్నారు. బడులకు, కాలేజీలకు, పనులకు సైకిలే. సాధారణంగానే అక్కడి పురుషాధిక్య సమాజం దీనిపై గుర్రుగా ఉన్నా కూడా ఏం చేయలేని పరిస్థితి. ఎందుకంటే బెంగాల్ నుంచి వచ్చిన కుటుంబాల మహిళల్లో చైతన్యం ఎక్కువ. ఎక్కడ తిరగబడతారోనని మొదట్లో మౌనందాల్చారు. ఈ అవకాశాన్నే ఆసరా చేసుకుని చాప కింద నీరులా సైకిల్ సిస్టర్స్ చొచ్చుకుపోయారు. ఇది ఓ రకంగా ఓ గెలుపే. 20 ఏళ్ల క్రితం అస్సలు కనిపించని దృశ్యం కాస్తా ఇప్పుడో లోకల్ సింబల్ అయిపోయింది. ఇప్పుడిప్పుడే సైకిళ్ల నుంచి స్కూటర్లకు మారుతున్నారు. మరింత వేగంగా లక్ష్యం చేరుకునేందుకు.

చికెన్ బ్రౌన్ రైస్ సూప్



కావాల్సిన పదార్థాలు

ఉప్పు కలపని చికెన్ స్టాక్ - 8 కప్పులు
ఉల్లిపాయ -1
క్యారెట్లు-3
కొత్తిమీర-రెండు కట్టలు
నీళ్ళు-2 కప్పులు
బ్రౌన్ రైస్-2 కప్పులు
చికెన్ ముక్కలు-1/4 కప్పు
బిర్యానీ ఆకు-1
పాలకూర -1 కట్ట
మిరియాలపొడి- 1 టీ స్పూన్
ఉప్పు- చిటికెడు

తయారుచేసే విధానం

కాస్త మందపాటి గిన్నెలో చికెన్ స్టాక్‌ని మరిగించాలి. అందులో ఉల్లిపాయ, క్యారెట్ ముక్కలు, కొత్తిమీర వేసి మధ్య మధ్యలో కలుపుతూ కనీసం ఎనిమిది నిమిషాలు మరిగించాలి. ఇప్పుడు మిగిలిన చికెన్ స్టాక్, నీళ్ళు, బియ్యం, చికెన్ ముక్కలు, బిర్యానీ ఆకు ఒకదాని తరవాత ఒకటి వేయాలి. మంట తగ్గించి కనీసం అరగంట దాకా మరిగించాలి. అన్నం, చికెన్ ముక్కలు ఉడికాక బిర్యానీ ఆకు తీసేసి పాలకూర తరుగు వేయాలి. ఐదు నిమిషాలయ్యాక రుచికి సరిపడా ఉప్పు, మిరియాల పొడి కలిపి సర్వింగ్ బౌల్స్‌లో పోసి సర్వ్ చేయండి.

స్వీట్ కార్న్ సూప్

కావాల్సిన పదార్థాలు

స్వీట్ కార్న్-1 కప్పు
ఉల్లికాడలు-1/2 కప్పు
కూరగాయలు ఉడికించిన నీళ్ళు- 3 కప్పులు
టమాటా సాస్-ఐదు చెంచాలు,
దాల్చిన చెక్క-కొద్దిగా
జీలకర్ర-1 టేబుల్ స్పూన్
మిరియాలు- 1 టేబుల్ స్పూన్
ఉల్లిపాయ తరుగు- 1/2 కప్పు
టమాటా -1
పచ్చిమిర్చి -4
ఉప్పు-చిటికెడు
పంచదార -2 టేబుల్ స్పూన్లు

తయారుచేసే విధానం

ముందుగా ఉల్లిపాయ, టమాటా, పచ్చిమిర్చి ముక్కలు తరిగి మిక్సీలో వేసి ముద్దగా చేయాలి. ఒక శుభ్రమైన వస్త్రంలో దాల్చిన చెక్క, జీలకర్ర, మిరియాలు తీసుకొని మూటలా కట్టాలి. ఉల్లిపాయ ముద్ద, సుగంధ ద్రవ్యాల మూట, మొక్కజొన్న లను కూరగాయలు ఉడికించిన నీళ్లలో వేసి పొయ్యి మీద పెట్టాలి. కొద్ది సేపటి తర్వాత ఉప్పు ఉల్లికాడలు టమాటా సాస్ వేసి బాగా మరిగించాలి. సూప్ చిక్కగా అవుతుంది. అప్పుడు సుగంధ దినుసుల మూటను తీసేసి సూప్‌ని వేడివేడిగా తీసుకుంటే చాలా రుచిగా వుంటుంది.

గార్డెన్ బేసిల్ పెస్టో

కావాల్సిన పదార్థాలు

టమాటా ముక్కలు- 2 కప్పులు
కీరదోస-3
ఉల్లిపాయ-1
క్యాప్సికం-1
కొత్తిమీర తరుగు-పావుకప్పు
క్యారెట్లు-4
బేసిల్ పేస్ట్/ కొత్తిమీర పేస్ట్-1/4 కప్పు
పాలకూర-1 కట్ట
ఆలివ్ నూనె-2 టేబుల్ స్పూన్లు
కూరగాయలు ఉడికించిన నీళ్ళు-1/2 కప్పు
ఉప్పు-రుచికి తగినంత
మిరియాల పొడి-చిటికెడు
టమాటా పేస్టు-4 టేబుల్ స్పూన్లు

తయారుచేసే విధానం

ముందుగా ఉల్లిపాయ, క్యారెట్, క్యాప్సికం, కొత్తిమీరలని సన్నగా కట్ చేసుకోవాలి. స్టౌపై ఒక మందపాటి పాత్ర వుంచి ఆలివ్ నూనె వేసి వేడెక్కిన తర్వాత అందులో ఉల్లిపాయ, క్యాప్సికం, క్యారెట్ ముక్కలు, కొత్తిమీర తరుగు వేసి వేయించుకోవాలి. అవి కాస్త మగ్గాక కీరదోస ముక్కలు, పాలకూర ఆకులు కూడా వేసి రెండు నిమిషాలు వేయించాలి. పాలకూర కొద్దిగా మెత్తగా అయ్యాక టమాటా ముక్కలు, టమాటా పేస్టు, కూరగాయలు ఉడికించిన నీళ్ళు ఒకదాని తర్వాత ఒకటి వేసుకొని కలుపుకోవాలి. కూరముక్కలు పూర్తిగా ఉడికిన తర్వాత ఉప్పు, మిరియాలపొడి వేసి మరో పదిహేను నిమిషాలు మరిగించాలి. చివరగా బేసిల్ పేస్ట్ వేసి మరో ఐదు నిమిషాలు వుంచి దింపేస్తే పసందైన సూప్ రెడీ!



చుక్కలు కలపండి





ఏ నీడ ఎవరిది



పిల్లలూ! ఇక్కడ కొంత మంది పిల్లలు వాళ్ళ ఎదురుగా కొన్ని నీడలు ఉన్నాయి. ఎవరి నీడ ఎక్కడుందో గుర్తించి జతచేయండి.

కనిపెడదాం

అగ్గిపుల్లలతో చేసిన ఒక చతురస్రాన్ని ఇక్కడ వుంచాం. దాని పక్కనే మరో నాలుగు పుల్లలున్నాయి. ఆ నాలిగిటినీ ఉపయోగించి చతురస్రాన్ని రెండు సమాన భాగాలుగా చేయడం ఎలానో కనిపెట్టండి.





దారి కనిపెట్టండి

ఇక్కడ కనిపిస్తున్న ఈ ఉడుత తన పిల్లలున్న గూటికి చేరే దారిని కనిపెట్టండి.

పదాలు గుర్తించండి

ఇక్కడిచ్చిన అక్షరాల పట్టికలో కింద ఉన్న పదాలు ఎక్కడ ఉన్నాయో గుర్తించి పెన్‌తో మార్క్ చేయండి.

BUILDING
BUS
CHURCH
CITY
HOSPITAL
HOTEL
HOUSE
MONUMENT
POLICE
RESIDENCE
RESTAURANT
ROAD
SCHOOL
STREET
SKYLINE

R	E	S	I	D	E	N	C	E	T
L	S	T	R	E	E	T	H	S	N
A	H	O	T	E	L	C	K	G	A
T	O	Y	T	R	R	Y	S	N	R
I	U	T	A	U	L	D	C	I	U
P	S	I	H	I	A	F	H	D	A
S	E	C	N	O	F	I	O	L	T
O	C	E	R	B	U	S	O	I	S
H	P	O	L	I	C	E	L	U	E
M	O	N	U	M	E	N	T	B	R

బొమ్మను పూరించండి

పిల్లలూ! మీకు బొమ్మలు గీయడమంటే ఎంతో ఇష్టం కదూ! మీ కోసం ఆర్టిస్ట్ అంకుల్ ముందుగా బొమ్మన్ని సగం గీసి ఉంచాడు. మీరు మిగిలిన భాగాన్ని జాగ్రత్తగా పూర్తిచేయండి!



తేడాలు గుర్తిద్దాం



ఈ రెండు బొమ్మల్లో మొత్తం పన్నెండు తేడాలు ఉన్నాయి. వాటిని మీరు గుర్తించి సున్నా చుట్టేయండి.

నీలి రంగు సాలీడు



పిల్లలూ మీకు సాలెపురుగులు తెలుసు కదా! ముదురు గోధుమ రంగులో వుండే సాలిపురుగులని మనం తరచూ చూస్తూనే వుంటాం. అయితే నీలి రంగులో వుండే సాలీడుని మీరెప్పుడైనా చూశారా.

- నీలిరంగులో ప్రత్యేకంగా వుండే ఈ సాలీడులని గూటి షాఫైర్, ట్రీ టరంటులా అని పిలుస్తుంటారు.
- ఇవి మన దేశానికి చెందినవే. ఆంధ్రప్రదేశ్‌లోని గూటి ప్రాంతంతోపాటు శ్రీలంకలో ఇవి ఎక్కువగా కనిపిస్తాయి.
- అనంతపురంలోని గూటి ప్రాంతంలో మొట్టమొదట గుర్తించబడటంతో వీటికి గూటి షాఫైర్ అనే పేరు వచ్చింది.
- మగవాటికంటే కాస్త పెద్ద పరిమాణంలో వుండే ఆడ సాలీడుల జీవిత కాలం 12 సంవత్సరాలు. మగవి ఇంతకంటే తక్కువ కాలం జీవిస్తాయి.
- 15-20 సె.మీ పొడవుండే ఇవి త్వరగా ఎదుగుదలకొస్తాయి.
- నీలి రంగు శరీరంపై ముదురు గోధుమరంగుతో వీటి శరీరం ఇతర సాలెపురుగుల కంటే చాలా భిన్నంగా వుంటుంది.



- నిజానికి అత్యంత ప్రకాశవంతంగా వుండే నీలిరంగు వాటికెలా వచ్చిందనేవాటిపై ఇప్పటికీ అధ్యయనాలు జరుగుతున్నాయి.
- ఇవి ఎక్కువగా పెద్ద చెట్ల తొర్రల్లో నివాసాలని ఏర్పాటుచేసుకుంటాయి.
- 1899లో ఈ రకం సాలీడులని మొట్టమొదట కనుగొన్నారు. తర్వాత 2001లో నంద్యాల, గిద్దలూరులో రెండోసారి మరి కొన్ని కనిపించాయి.
- ఇతర సాలీడుల్లా ఇవి వాటి గూటిని అంటిపెట్టుకొని వుండవు.
- చెట్లపై తిరుగుతూ ఇవి ఆహారాన్ని సేకరించుకుంటాయి.
- ఎగిరే చిన్న చిన్న కీటకాలని ఇష్టంగా తినేస్తుంటాయి.
- కొన్ని దేశాల్లో వీటిని ఇళ్ళలో పెంచుకుంటారు.
- అడవుల నరికివేత, విదేశీ ఎగుమతుల కారణంగా వీటి మనుగడ అత్యంత ప్రమాదకర స్థితికి చేరింది.

అంతరించిపోతున్న జీవాల జాబితాలో చేరిన ఈ సాలీడు ప్రస్తుతం ఒక్క ప్రాంతంలో మాత్రమే మనుగడ సాగిస్తోందనేది శాస్త్రవేత్తల నివేదిక.

ఆధారాలు

అడ్డం

1. భారీ వర్షాలు కురిస్తే ... (3)
3. చిన్నపిల్లవాడు (3)
8. ధనం (2)
9. చెంప (3)
10. విద్యార్థులు చదువుకునే స్థలం (2)
13. ఉపన్యాసం (3)
14. మంచు (3)
18. నాకుకాదు (2)
19. సమాచారం (3)
20. దూరం దూరంగా వేసేకుట్లు (2)
23. తొందర (3)
24. ఉండ (3)

పదవికాసం 69

కూర్పు: రావెళ్ల

	1	2			3	4		
5				6				7
8			9				10	
		11				12		
	13				14			
15				16				17
18			19				20	
		21				22		
	23				24			

నిలువు

2. ఎండా కాలంలో పండే పైరు పేరు (2)
4. తప్పెట (2)
5. పుల్ల (3)
6. మోసం (3)
7. గడప (3)
11. చైత్ర వైశాఖమాసాల్లో ఉండే ఋతువు (3)
12. స్త్రీ (3)
15. తాగేది (3)
16. సంశయం (3)
17. కొబ్బరికాయ (3)
21. వరస (2)
22. సంకటి (2)

సుడోకు

		7	8		5	2		
8			6		4			5
	1			9			8	
4			2	8	9			7
5			7	6	1			2
	7			3			6	
3			1		6			4
		2	5		8	1		

గతవారం జవాబులు

5	7	1	4	6	9	3	2	8
6	4	3	8	2	5	7	9	1
8	2	9	7	3	1	6	5	4
3	1	4	6	5	8	2	7	9
9	6	5	2	7	4	1	8	3
2	8	7	1	9	3	5	4	6
7	9	2	3	4	6	8	1	5
4	3	8	5	1	7	9	6	2
1	5	6	9	8	2	4	3	7

	1 వి	2 ధి	గా		3 వి	4 త్ర	నం	
5 ది		సం		6 ఆ		చె		
7 న	క్క		8 అ	నం	తం		9 బ	10 స
స		11 కా		దం		12 జి		ష్ట
13 రి	త్త	పు	చ్చు		14 అం	గీ	ర	స
కూ		రం		15 కం		ష		ము
16 లి	పి		17 పే	కా	ట		18 పం	ద్రా
		19 వీ		శం		20 సూ		లు
	21 పం	డు	గ		22 ప	తం	గి	

గొడుగు చెట్లు

యెమెన్‌లోని సాకొట్రా ద్వీపంలో ఉండే ఈ చెట్లను డ్రాగన్ బ్లడ్ వృక్షాలంటారు. గ్రానైట్, సున్నపురాతితో నిండిన కరకైన ఎడారి తరహా ప్రాంతంలో ఇవి మనుగడ సాగించటం విశేషం. మూడున్నర కోట్ల ఏళ్ల క్రితమే ప్రధాన భూభాగం నుంచి విడివడి అరేబియా సముద్రంలోకి చేరిన ఈ దీవిలో మరెక్కడా చూడని వృక్ష వైవిధ్యం ఉంటుంది. అలాంటి వాటిల్లో ఈ డ్రాగన్ బ్లడ్ వృక్షాలు కూడా ఒకటి. అక్కడ వర్షాలు అంతగా ఉండవు. వీటి మనుగడ కోసం గాలిలోని తేమను పీల్చుకునే ప్రత్యేక ఏర్పాటు చేసుకున్నాయి. సముద్రం నుంచి వచ్చే మంచు తెరలు, మేఘాలు విదిల్చే చిన్నస్థాయి తుంపర్లను ఒడిసిపట్టేందుకు ఓ రకంగా ఇవి గొడుగు విప్పిన విధంగా కనిపిస్తాయి. వీటి బంక ఎర్రగా నెత్తురు కారినట్టు చెట్ల బెరడు నుంచి స్రవిస్తాయి. అందుకే వాటికా పేరు వచ్చింది. సిన్నబార్‌గా ప్రాచీన కాలం నుంచి వాడుతున్నారు. వయొలిన్ లాంటి పరికరాలకు దీని డైని ఉపయోగిస్తారు. లక్షల ఏళ్ల పాటు భూమ్మీద మనగలుగుతోన్న వీటి జాతి భూతాపం వల్ల కూడా త్వరలో అంతమవ్వచ్చని పర్యావరణ వేత్తలు అంటున్నారు.

SASI EDUCATIONAL INSTITUTES VELIVENNU - 534 355

శశి వేలివెన్ను (రెసిడెన్షియల్)

తణుకు, ప.గో.జిల్లా

ఫోన్ : 08819-242222

ఒకే ఒక క్యాంపస్ నుండి రాష్ట్ర, జాతీయ స్థాయి పరీక్షలన్నింటా శశి విజయభేరి

NEET STATE-2017

STATE

43, 45, 47, 85, 92

100లోపు : 5 500లోపు : 20

1000లోపు : 36 2000లోపు : 91

NEET ALL INDIA-2017

ALL INDIA

519, 529, 561, 956

1000లోపు : 4 2000లోపు : 8

5000లోపు : 13 10000లోపు : 22

JIPMER+ AIIMS-2017

7+ Seats

ENGIEERNING-2017

190+ Seats

MEDICAL-2017

170+ Seats

JEE MAINS-2017

ALL INDIA OPEN CATEGORY

58th RANK

200లోపు: 6

500లోపు: 14

1000లోపు : 20

JEE ADVANCED-2017

ALL INDIA OBC PH CATEGORY

10th RANK

1000లోపు : 18

2000లోపు : 33

5000లోపు : 51

EAMCET ENGG-2017

STATE

13, 14, 49, 75, 97

500లోపు : 28 1000లోపు : 45

2000లోపు : 85 5000లోపు : 218

BITSAT-2017

422 HIGHEST MARK

400పైగా: 6

350పైగా : 19

300పైగా : 46

SR.INTER M.P.C-2017

990/1000 ఉత్తీర్ణతా శాతం : 100%

SR.INTER Bi.P.C-2017

989/1000 ఉత్తీర్ణతా శాతం : 100%

JR.INTER MPC-2017

465/470 ఉత్తీర్ణతా శాతం : 99.9%

JR.INTER BiPC-2017

434/440 ఉత్తీర్ణతా శాతం : 100%

SSC-2017

10/10 GPA 297

20.9%

86

Check List

Book Number	KN3R02B176	**Date**	3/09/22
Front Cover	yes	**Back Cover**	yes
Blank Pages	NO		
Missing Pages	NO		
Prepared By	Lakshmi	**Cutting By**	Lakshmi
Scanned By	pradhyu	**Pages**	29